

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

బుధవారం | 29 నవంబర్ 2023 | www.navatelangana.com

డజన్ పరిశ్రమలు తీసుకొస్తా

- నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిది • ఉపాధి కల్పిస్తా • గజ్వేల్‌కు భారీ ఐటీ పార్కులు • గజ్వేల్‌కు హైదరాబాద్ అనుసంధానం
- బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నష్టపోతాం • కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి • గజ్వేల్ ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉందంటే కొండపోచమ్మ, మల్లన్నసాగర్ నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదని సీఎం, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేసీఆర్ తెలిపారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ భూనిర్వాసితులకు ఉపాధి అవకాశాలతో పాటు వారికి కావాల్సిన బెనిఫిట్స్ అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే నిర్వాసితులకు పూర్తి భరోసా ఇచ్చినట్లు తెలిపారు. 12 పరిశ్రమలు తెస్తామన్నారు. కాలుష్యం లేని పరిశ్రమలు తీసుకొచ్చి అందరికీ ఉపాధి చూపిస్తామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించమన్నారు. కొండపోచమ్మ జలాశయం వద్ద కుండపోచమ్మ దేవస్థానం నిర్మిద్దామని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు టూరిజం స్పాట్గా మారినట్లు తెలిపారు. నాచారం దేవస్థానం మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గజ్వేల్ శాటిలైట్ సిటీగా మారుతుందని, ట్రిబుల్ ఆర్ రోడ్డు మరింత అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఇంద్రమ్మ రాజ్యంలో పేదరికం నిర్మూలన చేయలేక పోవడంతోనే దళితులు ఇంకా వెనుక పడ్డారని తెలిపారు. పైగా ఎమర్జెన్సీ ప్రకటించి అనేక మంది ప్రాణాలు

మిగతా 2లో..

ప్రలోభాలు.. పంపిణీ

- ఏరులై పారుతున్న మద్యం
- పోటాపోటీగా వెయ్యి.. రెండువేల పంపిణీ
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పంపకాల జోరు
- పోల్ మేనేజ్‌మెంట్‌పైనే అభ్యర్థుల ఆశలు
- నేరుగా ఓటర్లకు చేరేలా వంద ఓటర్లకో బాధ్యుడు
- కాలనీల్లో మకాం వేసిన బూత్ కమిటీలు
- తటస్థ ఓటర్లపై పోల్‌మేనేజ్‌మెంట్ వ్యూహకర్తల ఫోకస్

నవతెలంగాణ-మెదక్
ప్రాంతీయ ప్రతినిధి

ప్రచారాలు ముగిశాయి. ప్రలోభాలు...పంపిణే షురూ అయ్యాయి. ఇక మాటల్లేవు చేతలే అన్నట్లు పోటాపోటీగా వెయ్యి...రెండు వేలంటూ పంపకాలకు దిగారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల పంపకాల జోరు సాగుతోంది. పోల్ మేనేజ్‌మెంట్ సక్సస్‌పైనే అందరు దృష్టి పెట్టారు. ఇప్పటి వరకు మాటలతో మభ్యపెట్టిన అభ్యర్థులు నోటుతో మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తటస్థ ఓటర్లతో పాటు పక్కా పార్టీ అనుకున్న వాళ్లకు సైతం నోటు, మద్యం సీసా ఇస్తున్నారు. బూత్ లెవల్ కమిటీ ద్వారా పంపికాల ప్రక్రియ గుట్టుగా సాగిస్తున్నారు. ప్రతి 100 ఓట్లకు ఒక బాధ్యుల్ని పెట్టి ప్రలోభాల వ్యవహారాన్ని చక్కబెడుతున్నారు. ఇప్పటి వరకు గుంపులు గుంపులుగా ప్రచారం చేసిన తీరు మార్చారు. ఇద్దరు ముగ్గురుగా విడి పోయి కేటాయించిన ఓటర్లను కలుస్తున్నారు. తమ వాళ్లు అనుకున్న ఓటర్లను ఇతర పార్టీల అభ్యర్థులు ప్రలోభపెట్టకుండా కూడా జాగ్రతలు తీసుకుంటున్నారు. బయట ఉన్న ఓటర్లను రప్పించేందుకు ప్రత్యేకంగా బాధ్యుల్ని పంపి వాళ్లు ఉంటున్న ప్రాంతాలకెళ్లి



డబ్బులిచ్చి వస్తున్నారు. ఎన్నికల ప్రచారాలు పరిసమాప్తమయ్యాయి. ప్రచారానికి చివరి రోజు కావడంతో అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని అదరగొట్టారు. రోడ్ షోలు, సభలు, ర్యాలీలతో ఉమ్మడి మెదక్ జిల్లా దద్దరిల్లిపోయింది. గజ్వేల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరయ్యారు. స్వయంగా ఆయనే పోటీ చేస్తున్న నియోజకవర్గం కావడంతో భారీ

మిగతా 2లో..



ప్రాణ త్యాగానికి సిద్ధమై తెలంగాణ తెస్తే..

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

నవ తెలంగాణ - సిద్దిపేట/చేగుంట

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాణ త్యాగానికి సిద్ధమై తెలంగాణ తెచ్చిన మహాత్ముడని, మీరు ఒక్కరోజైనా కొట్లాడారా... దీక్షలు చేశారా.. కుర్చీ మీద కూర్చోవడానికి సిద్ధమవుతారా.. అని బీజేపీ, కాంగ్రెస్‌ను ఉద్దేశించి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. తెలంగాణ అసెంబ్లీ

మిగతా 2లో..

కొమ్మూరి గెలుపు కష్టమేనా?

- నామినేషన్ వేసే సమయంలో సానుకూలత • రోజు రోజుకు దిగజారిన కొమ్మూరి గ్రాఫ్
- నిరుత్సాహంలో కార్యకర్తలు • ఏం చేయాలో అయోమ పరిస్థితులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

జనగామలో కాంగ్రెస్ గెలుపు చేజారి పోతుందా..? అభ్యర్థి కొమ్మూరి స్వయంకృతాఅపరాధంతో గెలుపు కష్టంగా మారిందా..? ఇదీ..! హస్తం పార్టీ కార్యకర్తల నోట వినిపిస్తున్న గుసగుసలు.. గునుగుడు ముచ్చట్లు. నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచారంలో సైతం అభ్యర్థి ప్రజలను ఆకర్షించేలా మాట్లాడలేకపోవడంతో

మిగతా 2లో..

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

- ఏర్పాట్లు.. అవగాహన కార్యక్రమాలు
- రూ.24.72 కోట్ల నగదు పట్టివేత
- నగదు, మద్యం పంపిణీపై గట్టి నిఘా
- విలేకర్ల సమావేశంలో కలెక్టర్, ఎస్పీ



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. మంగళవారం

మిగతా 2లో..

ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) నిరంతరం పోరాటం

- ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు • మల్లికార్జున్‌ను గెలిపించాలని పిలుపు

నవతెలంగాణ-పటాన్‌చెరు, అమీన్‌పూర్

ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) మాత్రమే నిరంతరం పోరాటం చేస్తుందని.. కాబట్టి ఆ పార్టీకే ఓట్లు అడిగే నైతిక హక్కు ఉన్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తడానికి పార్టీ అభ్యర్థి మల్లికార్జున్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారం చివరి రోజైన మంగళవారం పటాన్‌చెరు, అమీన్‌పూర్ పారిశ్రామికవాడలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ

మిగతా 2లో..



నవతెలంగాణ

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

(మొదటి పేజీ తరువాయి)

కలెకటరేట్‌లో ఎస్పీ రూపేష్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్ల చైతన్యం కోసం అవగహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1393711 మంది ఓటర్లున్నారన్నారు. మొత్తం 16090 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వీటిల్లో 389 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు కనీస సదుపాయాలు కల్పించబడతాయన్నారు. 352 మంది వీడియో కెమెరామెన్లు, 2110 లొకేషన్స్ మైక్రో అబ్జర్వర్లు, 1039 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా నిఘా పెట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 29,30 తేదీల్లో పత్రికల్లో అడ్వటైజ్‌మెంట్స్ వేయకూడదని, మీడియా సర్టిఫికెట్ మానిటరింగ్ కమిటీ అనుమతి తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. 28న సాయంత్రం 5 గంటలకు ప్రచారాలు ముగిసినందున ఎక్కడా ఐదుగురికి మించి గుమికూడదని తెలిపారు. బయటి వ్యక్తులు కూడా సాయంత్రం తర్వాత ఉండకూడదన్నారు. జిల్లా వ్యాప్తంగా లాడ్జీలు, హెూటళ్లు, పంక్షన్ హాల్స్, గెస్ట్ హౌస్‌ల్ని తనిఖీ చేస్తామన్నారు. ఎవరైనా బయటి వ్యక్తులు ఉంటే చర్యలు తీసుకోబడతాయన్నారు. 15 ఫ్లయింగ్ స్క్వాడ్స్ మద్యం, డబ్బుల పంపిణీ జరగకుండా పర్యవేక్షిస్తున్నాయన్నారు. మూడు సిఫ్టుల్లో 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. పోలింగ్ రోజున అభ్యర్థి, అతని ఎజెంట్, ఒక నాయకుడి కోసం మూడు వాహనాలకు మాత్రమే ఆర్వో అనుమతి పొంది తిరగడానికి వీలుందన్నారు. అనుమతిలేని వాహనాల్ని అనుమతించబడదన్నారు. పబ్లిక్ తిరిగే వాహనాలపై ఆంక్షలు ఉండవన్నారు. ఇప్పటికే ఓటర్ల స్లిప్స్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఓటరు ఐడీ కార్డు లేదంటే మరో 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏ ఒక్కటున్నా ఓటు వేసేందుకు అనుమతించాలని పోలింగ్ బూత్ అధికారులకు ఆదేశాలున్నాయన్నారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ జిల్లాలో 4500 మంది పోలీస్‌లు ఎన్నికల బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారన్నారు. రాష్ట్ర, కేంద్ర బలగాలతో పాటు హెూంగార్డులు విధుల్లో ఉన్నారన్నారు. జిల్లాలో ఎన్నికల్లో ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా నేర చరిత్ర కల్గిన 5100 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలోనే ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్స్ అనుమతి లేదన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎస్‌ఎస్, ఎస్‌ఎఫ్‌సీ టీమ్‌ల ద్వారా రూ.5.24 కోట్లు, ఐటీ సెల్ ద్వారా 19.48 కోట్ల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా 7 కిలోల బంగారం, 23 కేజీల వెండి, 26 వేల లీటర్ల మద్యం స్వాదినం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ నగేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) నిరంతరం పోరాటం

(మొదటి పేజీ తరువాయి)



సందర్భంగా ఆయా చోట్ల చుక్క రాములు మాట్లాడుతూ.. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సీపీఐ(ఎం)ను ప్రజలు ఆదరించాలన్నారు. ప్రజల గొంతుకను శాసనసభలలో వినిపించేందుకు ఈ ప్రాంతంలో మల్లిఖార్జున్‌కే ఓటు వేయాలని కోరారు. మల్లికార్జున్ మాట్లాడుతూ.. సుత్తి కొడవలి చుక్క గుర్తుపై ఓట్లేసి గెలిపిస్తే ప్రజా కార్మిక సంక్షేమం కోసం కషి చేస్తానన్నారు. పటాన్‌చెరులో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మల్లేష్, జయరాజు, మాణిక్, సాయిలు, నాగేశ్వరరావు, ప్రవీణ్, యాదగిరి, అశోక్, సంతు, మల్లేష్, తోషిబా యూనియన్ నాయకులు అనంతరావు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, త్రిమూర్తులు, తిరుపతి, శ్రీనివాస్, సాంబశివరావు, బంగారాజు, శ్రీధర్, సంతోష్ గౌడ్, రాజశేఖర్, అమీన్‌పూర్‌లో పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మహిపాల్, వాజీద్ అలీ, సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

డజన్ పరిశ్రమలు తీసుకొస్తా

(మొదటి పేజీ తరువాయి)

తీసిందన్నారు. మొదటగా గజ్వేల్ నియోజకవర్గంలో దళితులందరికీ దళిత బంధు అమలు చేస్తామన్నారు. దీంతో దళితుల దరిద్రం పోతుందని ఆయన చెప్పారు. నా వయసు వచ్చే ఫిబ్రవరి నాటికి 70 సంవత్సరాలవుతుందని, తెలంగాణ అభివృద్ధి శ్వాసగా జీవిస్తున్నానని తెలిపారు. గజ్వేల్ గడ్డ నుంచి ప్రతి పల్లెకు నీరు అందిస్తున్న ఘనత గజ్వేల్‌కే దక్కిందన్నారు. ఈ నెల 30న కారు గుర్తుకు ఓటు వేసి గజ్వేల్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ప్రతాపరెడ్డి, శాసనమండలి ఉప చైర్మన్ బండ ప్రకాష్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మణికొండ లక్ష్మి కాంతారావు, మాజీకార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ హేమలత శేఖర్ గౌడ్, గ్రంధాల సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంపిటిసి ఫోరం గౌరవ అధ్యక్షులు దేవి రవీందర్, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, గజ్వేల్ తూప్రాన్ మున్సిపల్ చైర్మన్లు రాజమౌళి, రాఘవేంద్ర గౌడ్, గజ్వేల్ ఎంపీపీ అమరావతి, జడ్పీటిసి పంగ మల్లేశం, సుధాకర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ భూమిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణ త్యాగానికి సిద్ధమై తెలంగాణ తెస్తే..

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల ప్రచారంలో చివరి రోజు మంగళవారం సిద్దిపేటతో పాటు చేగుంటలో మంత్రి భారీ రోడ్‌షో నిర్వహించారు. పూల వర్షంలో, టపాసుల శబ్దంతో రోడ్‌షో సాగింది. పాత బస్టాండ్ వద్ద ఆయన మాట్లాడుతూ సిద్దిపేట అంటే అభివృద్ధి.. అభివృద్ధి అంటే సిద్దిపేట అని అన్నారు. ప్రతిసారి మెజార్టీ పెంచుతూ నన్ను గెలిపించారని, ఈ జన్మ మీకే అంకితం అన్నారు. పార్టీ కోసం ప్రచారం చేయమని నన్ను రాష్ట్రానికి పంపించారని, నేను లేకున్నా మీరే ముందుండి గ్రామ గ్రామాన నా తరపున ప్రచారం చేశారని, మీ ప్రేమ వెలకట్టలేనిదని అన్నారు. కేసీఆర్ తోనే తెలంగాణ సాధ్యమైందని, తెలంగాణ రావడంతోనే సిద్దిపేట జిల్లా అయిందని, రైలు వచ్చిందని, గోదావరి జిల్లాలు తెచ్చుకున్నామని అన్నారు. తాగునీటికి గోసగా ఉన్న సిద్దిపేట జిల్లాకు, రెండు పంటలు పండే విధంగా సాగునీటిని తెచ్చుకున్నామని అన్నారు. ప్రతిపక్షాలు విమర్శలు చేస్తే మీ ఓటుతో గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్‌ది సుతి లేని సంసారం అని, వారికి ఓటు వేయవద్దని కోరారు. నా కుటుంబం సిద్దిపేట అని, ప్రజలే నా కుటుంబ సభ్యులన్నారు. ఐదు సంవత్సరాలు రేపే ఎన్నికలు అన్న విధంగా ప్రతిరోజు పని చేశానని, దసరా, రంజాన్, క్రిస్టమస్ పండుగలు ఇక్కడే నిర్వహించుకున్నామని అన్నారు. సిద్దిపేట ప్రజలే నా బలం.. నా బలగం అని అన్నారు. పేదలకు అండగా ఉండేది గులాబీ జెండా.. కారు గుర్తు అని అన్నారు. ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో ప్రజలందరూ పాల్గొని, పోలింగ్ శాతం పెంచాలని, దేశంలో మారుమోగే విధంగా మెజార్టీ తీసుకురావాలని, అభివృద్ధికి పట్టం కట్టాలని ఓటర్లను కోరారు. సిద్దిపేట చుట్టూ ఉన్న హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రెండు రోజులు కష్టపడి పని చేయాలని కోరారు.

పూల వర్షం.. జననిరాజనం

మంత్రి వేములవాడ కమాన్, నర్సాపూర్ చౌరస్తా, కమాన్ మీదుగా ముస్తాబాద్ చౌరస్తా... అక్కడి నుంచి పాత బస్టాండ్ వరకు భారీ రోడ్డు షో నిర్వహించారు. అడుగడుగునా మంత్రిపై పూల వర్షం కురిపించి ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ రోడ్ షోలో జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, ఎమ్మెల్సీ రగోతం రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు సాయిరాం, సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్ల కాంగ్రెస్ రాష్ట్రానికి ఊరగబెట్టింది లేదు

'60 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో రాష్ట్రానికి ఊరగబెట్టింది లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే నెల రోజుల్లో చేగుంట పట్టణ కేంద్రంలో విద్యార్థులకు డిగ్రీ కాలేజ్, స్పోర్ట్స్ వాళ్లకి స్టేడియం మంజూరు చేసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేస్తా' అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. చేగుంట పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా వడియారం నుంచి మెదక్ రోడ్డు గాంధీ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ చేతి గుర్తుకు ఓటు వేసి రాష్ట్రాన్ని అంధకారంపాలు చేయకూడదని అన్నారు. బీజేపీ రాష్ట్రంలో రాదని, కల్లబొల్లి మాటలు చెప్పి గెలిచిన బీజేపీ ఎమ్మెల్యేకు బుద్ధి చెప్పాలని కోరారు. దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు పర్యాయాలుగా ప్రజలందరూ ఆశీర్వదిస్తే ఎంపీగా గెలిచి ఏడు నియోజకవర్గాలకు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశానని, నేను దుబ్బాక బిడ్డని ఇక్కడే చదువుకొని అక్షరాలు నేర్చుకున్నానని, చేగుంట హైవే రెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే రహదారి అక్కడ ఎంతోమంది యాక్సిడెంట్లకు గురై చనిపోయారని, విషయాన్ని నా దృష్టికి తీసుకువస్తే బ్రిడ్జిని మంజూరు చేయించానని తెలిపారు. తూప్రాన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి, నర్సింగ్ మండలం జప్తి శివనూర్, రామయంపేటలో బ్రిడ్జిలను మంజూరు నేనే చేయించుకు వచ్చానని, కష్టపడి పని నేను చేస్తే ఇటీవల గెలిచిన దొంగ, లుచ్చ మాటల ఎమ్మెల్యే ఫొటోలు దిగి తాను మంజూరు చేయించానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నెల రోజుల్లో చేగుంటకు డిగ్రీ కాలేజ్ మంజూరు చేయిస్తానని, ఆడుకోవడానికి స్టేడియం, గజ్వేల్ తరహాలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఏర్పాటు చేస్తానన్నారు. చేగుంట నుంచి మెదక్ కు వెళ్లే దారిలో రైల్వే గేట్ బ్రిడ్జిని మంజూరు చేయించారని, టెండర్లు కూడా పూర్తి అయ్యాయని, సంవత్సరం లోపల బ్రిడ్జి పూర్తవుతుందని, రైల్వే స్టేషన్ రోడ్డు, చేగుంటలో అన్ని కుల సంఘాల భవనాలకు తమ గెలవగానే కచ్చితంగా మంజూరు చేయిస్తానని పూర్తి బాధ్యత నాదేనా అని తెలిపారు. దొంగ, లంగ మాటలు చెప్పేటోడు సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును, ఎంపీగా ఉన్న తనని వక్రభాషతో తిట్టారని, త్వరలోనే నా సత్తా ఏంటో చూపిస్తా, తాను ధర్మం వైపు నిలబడతా అన్నారు. దుబ్బాకను అభివృద్ధి చేయడానికి ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందు కేసీఆర్ వద్ద దుబ్బాకను అభివృద్ధి చేయాలని హామీ తీసుకున్నానని, అందుకే ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, ప్రజలందరూ ఆశీర్వదించి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జడ్పీటిసి శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్, ఎంపిటిసి అయిత వెంకటలక్ష్మి రఘురాం, సీనియర్ నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, నారాయణరెడ్డి, నాయిని రాజగోపాల్, దుబ్బాక ఇన్చార్జిలు వెంకట నరసింహారెడ్డి, మల్లికార్జున రెడ్డి, మిట్టపల్లి శ్రీనివాస్, భీమసేన, పట్టణ అధ్యక్షులు ఎర్ర యాదగిరి, రుక్మాపూర్ అధ్యక్షులు మైలారం రామచంద్రం, కన్యారం ఉపాధ్యక్షులు కొలుపుల స్వామి, పట్టణ అధ్యక్షులు వంశీ, దుబ్బాక నియోజకవర్గం యువజన నాయకుడు క్రాంతి కుమార్, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలు.. పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

జన సమీకరణ చేశారు. సంగారెడ్డిలో బీఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్ గెలుపు కోసం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అభ్యర్థి ప్రభాకర్ మాట్లాడుతూ తన ఆరోగ్యం బాగలేకపోయినా ప్రజలు ఇంత ఆదరణ చూపుతుండడంతో బావోద్వేగానికి లోనయ్యారు. కంట తడి పెట్టుకునేసరికి సభకు వచ్చిన వాళ్లంతా సీపీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ గెలుపు కోసం నిర్వహించిన సభకు ప్రియాంక హాజరయ్యారు. భారీగా జనం తరలి వచ్చారు. పటాన్‌చెరు, నారాయణఖేడ్, అందోల్, నర్సాపూర్, మెదక్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ పోటీగా ర్యాలీలు నిర్వహించాయి. తటస్థ ఓటర్లపై ప్రభావం చూపేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లుగా బల ప్రదర్శన చేశాయి.

ఓటుకు నోటు... సీసా

రేపే పోలింగ్ జరగనున్నందున ఓటర్లకు పంపకాలు షురూ చేశారు. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్ల వివరాలను ఆయా పోలింగ్ కేంద్రాల వారిగా విభజించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటర్లను ఆయా వార్డులు, కాలనీలు, బస్తీలు, ఏరియా, అపార్ట్‌మెంట్స్, గ్రేటర్ కమ్యూనిటీ కాలనీల వారిగా వేరే చేశారు. బూతుల వారిగా ఓటరు జాబితాలో ఉన్న వారిలో ఎవరు కాంగ్రెస్, ఎవరు బీజేపీ అనేది కూడా స్థానిక నాయకులు గుర్తించారు. పక్కాగా మనకు ఓటు వేయరు అనుకున్న వాళ్లను మినహాయించి మిగతా వాళ్లందరికీ ఏదో ఒక రూపంలో అంటే డబ్బులు, లేదా మద్యం, కొందరికి రెండు ఇచ్చి ఓటు వేయించుకునే పనిలో ఉన్నారు. కొన్ని చోట్ల కాలనీలు, తండాలు, వాడలు, కులాలు, ఉప కులాలు, సంఘాల వారిగా కూడా గంపగుత్తగా ఓట్లు వేసేట్లుగా మాట్లాడుకుని ప్రమాణాలు చేయించుకుంటున్నారు. గుళ్లు, చర్చీలు, మసీదుల్లోనూ వారి మత పెద్దలు సైతం ఓట్లు వేసే విషయాల్లో ప్రామీస్ చేయిస్తున్నారు. ఆయా మతాల్లోని వారంతా ఒకే పార్టీ వెనకాల లేకపోయినా ఎవరికి నచ్చిన పార్టీ వాళ్లు ప్రత్యేకంగా చర్చించుకుంటున్నారు. జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, మెదక్, దుబ్బాక, గజ్వేల్, జనగాం, హుస్నాబాద్, అందోల్ వంటి నియోజకవర్గాల్లో ఓటుకు వెయ్యి నుంచి రెండు వేల వరకు పంపిణీ చేస్తున్నారు. ఒక పార్టీ వాళ్లు వెయ్యి ఇస్తే ఆ విషయం తెలుసుకున్న మరో పార్టీ రెండు వేలు ఇస్తున్నారు. పటాన్‌చెరులో కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పాటు బీఎస్పీ అభ్యర్థి కూడా పోటీపడి డబ్బులు, మద్యం పంపిణీ చేస్తున్నారు. గజ్వేల్, దుబ్బాకలోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పాటు బీజేపీ అభ్యర్థులు కూడా డబ్బులు, మద్యం విపరీతంఆ పంచుతున్నారు.

బయటి ఓటర్లపై దృష్టి

నియోజకవర్గంలోని ఓటర్లు ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం నిమిత్తం బయటి ప్రాంతాల్లో ఉంటున్నారు. వాళ్లకు వారి సొంత గ్రామాలు, పట్టణాల్లో ఓట్లు ఉన్నాయి. వాళ్లంతా ఓటు నాడు వచ్చి ఓటు వేసి పోతారు. అయితే వాళ్లందర్నీ ఆయా పార్టీల వాళ్లు గుర్తించారు. బయట ఉన్న ఓటర్లలో ఎవరు ఏ పార్టీకి చెందిన వాళ్లో తెలుసుకుని ఆ పార్టీ తరపున కొందరు వెళ్లి డబ్బులిచ్చి వస్తున్నారు. తటస్థంగా ఉండే ఓటర్లు అయితే వాళ్లకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ వాళ్లు కూడా డబ్బులిచ్చి 30న వచ్చేట్లు చూస్తున్నారు. బయటి నుంచి వచ్చే ఓటర్లకు వారుడే దూరాన్ని బట్టి బస్సు ఛార్జీలు, భోజనం ఖర్చులకు డబ్బులిస్తున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో బయటి ఊర్లల్లోఉన్న ఓటర్లకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు ఇచ్చి వస్తున్నారు. వాళ్లంతా బస్సులు, ఆటోల్లో వచ్చేట్లు ఏర్పాటు చేసి వస్తున్నారు. ఇతర నియోజకవర్గాల్లో వెయ్యి నుంచి రెండు వేలు ఇస్తున్నారు. కుటుంబాల వారిగా వచ్చే అవకాశమున్నందున వాళ్లను మచ్చిక చేసుకుంటే గంపగుత్తగా ఓట్లు పడే అవకాశముందని వాళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. వాళ్ల ఫోన్ నెంబర్లు, ఉండే ప్రాంతం, నివాస అడ్రస్ తెలుసుకుని వాళ్లతో ఫోన్లో మాట్లాడుతున్నారు. వచ్చేందుకు వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. లేదంటే బస్సుల్లో వచ్చేట్లు చూస్తున్నారు. కొందరేమో కార్లు, ఇతర స్వంత వాహనాల్లో వస్తామంటే వాళ్లకు ఖర్చులు ఇస్తున్నారు. హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న వాళ్లను రప్పిస్తున్నారు. నియోజకవర్గం బయట, జిల్లా బయట, రాష్ట్రం బయట ఉన్న వాళ్లెవరనేది కూడా ముందే గుర్తించి రప్పిస్తున్నారు.

కొమ్మూరి గెలుపు కష్టమేనా?

(మొదటి పేజీ తరువాయి)

ఓటర్లు సైతం కాంగ్రెస్ వైపు కన్నెత్తి చూడడం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎంత చెప్పినా జనం మాత్రం జనగామ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాపరెడ్డి ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండడు అనే విషయాలనే ప్రస్తావిస్తున్నారు. ఆయన ఎప్పుడొస్తడో... ఎప్పుడు పోతడో అనే అనుమానాలతో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం లేదంటున్నారు. స్థానికుడినని చెప్పుకునే కొమ్మూరి ప్రతాపరెడ్డి తన సొంత గ్రామంలో ఓటు హక్కు కూడా కల్గిలేరు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పై భరోసాతో జనగామ జిల్లా డీసీసీ అధ్యక్ష పదవితో పాటు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ వచ్చిన గ్రాఫ్‌తో కొమ్మూరి ప్రతాపరెడ్డి నియోజకవర్గంలో 60 శాతం ప్రజల మద్దతు తనకే ఉందనే అంచనాకు వచ్చారంటున్నారు. ఎమ్మెల్యేగా గెలుస్తున్నానన్న ఒవర్ కాన్ఫిడెన్స్‌ను ప్రదర్శిస్తూ చురుగ్గా గ్రామాలలో ప్రజలను కలవలేదు. ప్రజల్ని ఆప్యాయంగా పలకరిస్తూ వాళ్ల దగ్గరకు వెళ్లకపోయారు. దీంతో రోజు రోజుకు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గ్రాఫ్ తగ్గుతూ వచ్చింది. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఒంటెద్దు పోకడలతో గెలుస్తానని అతి నమ్మకంతో కార్యకర్తలను సైతం పట్టించుకున్న పాపాన పోలేదు. మద్యం, డబ్బులు పంచి గెలిస్తాననే ధీమా వికటించే ప్రమాదం లేకపోలేదంటున్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పార్టీలు మారిన కొమ్మూరిని అంతగా విశ్వసించట్లేదు. ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకుల్ని నమ్మే విషయంలోనూ అనుమానస్పద వైఖరి ప్రదర్శిస్తుండడంతో చాలా మంది ఏమీ అనలేక సర్దుకుపోతున్నారు.

మద్దూరు, దూల్మిట్ట, కొమురవెల్లి, చేర్యాల మండలాల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని బావిస్తున్న ఓటర్లు ఉన్నప్పటికీ అభ్యర్థి కొమ్మూరి వ్యవహార శైలి వల్ల వాళ్లు సైతం వ్యతిరేకిస్తున్న పరిస్థితి నెలకొంది. గెలిచిపోయామనే అతి విశ్వాసం కాంగ్రెస్ కొంప ముంచుతుందని పలువురు సూచించే ప్రయత్నం చేసినా వారి మాటల్ని సైతం కొమ్మూరి పెడచెవిని పెడుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు మాస్ లీడర్లను ఎక్కువగా ఇష్టపడతారు. కొమ్మూరి విషయంలో ఆయన ప్రవర్ధన ను కాంగ్రెస్ కార్యకర్తలకు పెద్దగా రుచిస్తలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో కాంగ్రెస్ పార్టీ గెలిచే సీట్లు ఓటమి చెందడానికి కొమ్మూరి ప్రతాపరెడ్డి కారణం అవుతాడని సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ప్రతాపరెడ్డి వ్యవహారం వల్ల కాంగ్రెస్ ఓడిపో తుందేమోనన్న నిరుత్సహాంలో కాంగ్రెస్ కార్యకర్తలున్నారు.

చేర్యాల నియోజకవర్గం రద్దు వెనకాల కొమ్మూరి

చేర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసిన కొమ్మూరి రాజిరెడ్డి పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చేర్యాల నియోజకర్గం రద్దు కావడానికి ఆయనే కారణమనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన కనీసం నియోజకవర్గం రద్దు అవుతుంటే పట్టించుకోలదేని, నిమ్మకు నీరెత్తినట్లు ఉపేక్షించాడని ప్రజలు పేర్కొంటున్నారు. అలాంటి వ్యక్తికి ఓట్లు ఎందుకు వేయాలని ప్రశ్నిస్తున్నారు. జిల్లాల విభజన పేరిట చేర్యాల అస్తిత్వాన్ని దెబ్బతీస్తుంటే కూడా కొమ్మూరి పట్టించుకోలేదంటున్నారు. కొట్లాడి సాధించుకున్న దేవాదుల నీటిని తరలించుకుపోతుంటే ప్రతాపరెడ్డి పట్టించుకోలేదనే అపవాదు ఉంది.

నవతెలంగాణ
నవతరం తెలుగు దినపత్రిక
3
మెదక్
బుధవారం 29-11-2023 www.navatelangana.com

నర్సాపూర్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయం

- ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి

నవతెలంగాణ-కౌడిపల్లి

నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి పేర్కొన్నారు. నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డికి మద్దతుగా స్థానిక సర్పంచ్ చిలుముల వెంకటేశ్వర రెడ్డితో కలిసి మండల కేంద్రమైన కౌడిపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బీఆర్ఎస్ ప్రభుత్వానికి మరోమారు పట్టం కట్టాలన్నారు. గడిచిన 10 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అన్ని కులాల వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందించడం జరిగిందన్నారు. ఈసారి ప్రజలు ఆదరించి గెలిపిస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ మాయ మాటలు నమ్మొద్దన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకటి రాజ్యం వస్తుందన్నారు.



బీఆర్ఎస్‌కు ఓటేసి సునీత రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర నాయకులు చిలుముల నరసింహారెడ్డి, ఎంపీటీసీ కాలేరు మంజుల శివాంజనేయులు, పిఎసిఎస్ సొసైటీ వైస్ చైర్మన్ చిలుముల చిన్నంరెడ్డి, ఉప సర్పంచ్ చంద్రం, శ్రీనివాస్ గౌడ్, మండలం పార్టీ అధ్యక్షుడు సార రామా గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం దుర్గ గౌడ్, కౌడిపల్లి ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు బుజరంపేట్ మల్లేశం, వార్డు సభ్యులు, ఉడుత రాజు గుప్తా, తిరుమలేష్, బర్ల కృష్ణ, నాయకులు శెట్టయ్య, పెంటగౌడ్, మురళి నాయక్ పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో కేసీఆర్ విజయం ఖాయం



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గజ్వేల్ నియోజక వర్గంలో ఎన్ని పార్టీలు ఉన్నా ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని తూప్రాన్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి బాబుల్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు తూప్రాన్ మండలం నుంచి మండల పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో తరలివెల్లారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లో నిర్వహిస్తున్న సభకు ప్రజలు నిస్వార్థంగా స్వచ్ఛందంగా తరలిరావడంతోనే సీఎం కేసీఆర్ భారీ మెజారిటీతో విజయం ఖాయమైందన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజలు చాలా ఆనందంగా ఉన్నారని ఇతర పార్టీలు ఎన్ని చెప్పినా ప్రజలు వినే పరిస్థితిలో లేరని ప్రజలంతా బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సభకు తరలివెల్లిన వారిలో యావాపూర్ సర్పంచ్ శేరి నర్సింహరెడ్డి, ఎంపీటీసి సంతోష్‌రెడ్డి, శంకర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను గెలిపించాలి

నవతెలంగాణ- కౌడిపల్లి



నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వెంకట్రావుపేట్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కుద్బుద్దిన్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తెలంగాణ అభివృద్ధి పథంలో నెంబర్ వన్ రాష్ట్రంగా దూసుకుపోతుందన్నారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ సరికొత్త సంక్షేమ పథకాలను తీసుకువచ్చి గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ రెడ్డి సునీత రెడ్డి ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. మూడవసారి హ్యాట్రిక్ విజయం సాధించి అన్నపూర్ణ పథకంతో ఇంటింటికి సన్న బియ్యం, ఆసరా పింఛన్ల పెంపు రైతుబంధు 16 వేలకు పెంపు, మహిళలకు 400కే గ్యాస్, అర్హులందరికీ గృహలక్ష్మి పథకం, మరెన్నో బృహత్తర పథకాలతో బంగారు తెలంగాణగా రూపుదిద్దుకుంటుందన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేసి సునీత లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

గౌడజనుల అభివృద్ధికి కృషి చేసిన బీఆర్ఎస్

నవ తెలంగాణ-నర్సాపూర్

గౌడ జనుల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని చాముండేశ్వరి ఫంక్షన్ హాల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్ రెడ్డి, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో గౌడ కులస్తులకు ప్రతి సంవత్సరం రూ.20 కోట్ల రెంటల్స్ మాఫీ చేయించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత హైదరాబాదులో103 కల్లు దుకాణాలను తెరిపించి హైదరాబాదులో నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏర్పాటు తోపాటు గౌడ సంఘం భవనం నిర్మాణం, ప్రజా సంక్షేమ పథకాలు, కళ్యాణ లక్ష్మి, పింఛన్లు



వంటివి ఎన్నో సంక్షేమ పథకాలను అందించమన్నారు. అనంతరం గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లే లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గౌడ కులస్తులను పట్టించుకోలేదన్నారు. దీంతో కులవృత్తిని నమ్ముకున్న గౌడ కులస్తులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గౌడ కులస్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారని గుర్తు చేశారు. గౌడ సంఘం రాష్ట్ర నాయకులు ప్రతాప్ లింగం గౌడ్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు అశోక్ గౌడ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్ నాయకులు సత్యం గౌడ్, నాగరాజు గౌడ్, నియోజకవర్గంలోని గౌడ సర్పంచులు పాల్గొన్నారు.

పోటాపోటీగా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-మెదక్

అసెంబ్లీ ఎన్నికల జాతరలో చివరి అంకం ముగిసింది. మంగళవారంతో అభ్యర్థుల ప్రచారానికి తెరపడటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. ఆఖరు రోజు మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో కిక్కిరిసపోయింది. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌లు ఆయా పార్టీల మేనిఫెస్టోలు, అభివృద్ధి పై విమర్శలు, ప్రతివిమర్శలు చేస్తూ ప్రచారాన్ని ముగించారు. ఇరుపార్టీల అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ ప్రజలు పెద్ద



ఎత్తున తరలివచ్చారు. డప్పు చప్పుళ్ల, సన్నాయి వాయిద్యాలు, ఆయా పార్టీల నినాదాలతో హోరెత్తించారు.

బీజేపీ, కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు

నవతెలంగాణ-నార్సింగి

తెలంగాణ రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల ప్రచారం చివరి రోజు మండల కేంద్రంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రచార జోరు పెంచాయి. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఎన్నికల ప్రచారం కోసం మండల పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కత్తి కార్తీక గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారీ జన సందోహం మధ్య పట్టణ కేంద్రంలో రోడ్ షో లో పాల్గొన్న కార్తీక గౌడ్ ప్రజల తో మమేకమై నృత్యాలు చేస్తూ ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా కత్తి కార్తీక గౌడ్ ప్రసంగిస్తూ బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు మాయ మాటలు చెప్పి ఉప ఎన్నికలలో గెలుపొందారన్నారు. ఇచ్చిన హామీలలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగ యువకులకు రూ. 3 వేలు పెన్షన్ ఇస్తానని, రైతులకు ఎడ్లు ఇస్తానని కల్లబొల్లి మాటలతో గెలిచారని, మళ్ళీ మోసం చేయాలని చూస్తున్నారని మండి పడ్డారు. బీసీలపై దొంగ ప్రేమను చూపిస్తూ బీసీ ముఖ్యమంత్రి అని అంటున్నారని, రెండు సీట్లు మాత్రమే గెలిచే పార్టీకి ముఖ్యమంత్రి ఎలా ఉంటారని ఎద్దేవా చేశారు. రఘునందన్‌కు బీసీలపై నిజమైన ప్రేమ, గౌరవం ఉంటే ఆయన పోటీ నుంచి పక్కకు జరిగి ఒక బీసీ అభ్యర్థిని ఎన్నికలలో నిలబెట్టి, ఆయన విజయానికి కృషి



చేసేవారన్నారు. రేవంత్ రెడ్డి స్వార్థ రాజకీయం తాను ప్రత్యక్షంగా చూశానని, ఆయన స్వార్థానికి తాను బలయ్యానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో కరెంటు కష్టాలను, చీకట్లను, రైతుల ఆత్మహత్యలను ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రాష్ట్ర ప్రజల, రైతుల బతుకుల్లో చీకటి నింపిన వారవుతామని వివరించారు. ప్రజలు జాగ్రత్తగా ఆలోచించి తమ ఓటును బీఆర్ఎస్ అభ్యర్థికి వేసి లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు ఆకుల సుజాత గౌడ్, సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపిపి ఆకుల మల్లేష్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శంకర్ గౌడ్, మండల మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షుడు ఫరీద్, పట్టణ మైనారిటీ అధ్యక్షుడు జమీర్, పట్టణ యూత్ అధ్యక్షుడు సుదీప్ గౌడ్, టెలికం బోర్డు మాజీ సభ్యుడు రాజేష్, వార్డు సభ్యులు జీవన్, గణేష్, ఎస్ఎంసి చైర్మన్ బాఖర్, పార్టీ నాయకులు ముజీబ్, భూపతి, సిద్దిరాములు, ప్రభాకర్ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సునితా రెడ్డికే తమ మద్దతు



నవ తెలంగాణ-నర్సాపూర్

బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ మంగళవారం పట్టణంలోని 140 మంది టూవీలర్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా టూవీలర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ టూ వీలర్ అసోసియేషన్ సభ్యులందరూ కుటుంబ సమేతంగా సునీత రెడ్డికి ఓటు వేసి గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ అర్జున్, కోశాధికారి మహేష్, జిల్లా ప్రెసిడెంట్ ఖలీల్, వైస్ ప్రెసిడెంట్ జాంగిర్ పాషా నరేష్ తదితరులు ఉన్నారు.

డిబిఎఫ్ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే వర్ధంతి

నవతెలంగాణ-నిజాంపేట

స్థానిక బస్టాండ్ ఆవరణలో మంగళవారం డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, ఉపసర్పంచ్ కొమ్మటబాబుల ఆధ్వ ర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే 133వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాష్ట్రలో జన్మించిన మహాత్మ జ్యోతిబాపూలే సామాజిక సేవలు చేస్తూ మానసిక బానిసత్వం నుంచి శూద్రులను కాపాడడానికి తృతీయ రత్న అనే నాటకాన్ని రచించా రన్నారు. ఫస్ట్ క్లాస్ ఎక్స్ క్లూస్ అనే గ్రంథం ద్వారా సమాజంలో పాతుకు పోయిన దురాచారాలను మూఢనమ్మకాలను ఖండించారన్నారు. ఈ సిద్ధరాం రెడ్డి, సంగు స్వామి, స్వామి గౌడ్, బండారి ఎల్లం, తమ్మలి రమేష్, నాయిని లక్ష్మణ్, కొమ్మాట రామస్వామి, నారా గౌడ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రేపు కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి

నవ తెలంగాణ - సిద్దిపేట

ఈ నెల 30న పోలింగ్ సందర్భంగా జిల్లాలోని దుకాణాలు, సంస్థలలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులందరికీ వేతనంతో కూడిన సెలవులు ప్రకటిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ టీఎస్ సెక్షన్ 31లోని సబ్-సెక్షన్ (2) కింద ఇవ్వబడిన అధికారాలు దుకాణాలు, ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం 1988, తెలంగాణ షాప్స్, ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 1988 కింద సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ

గజ్వేల్ కేసీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



నవతెలంగాణ-మర్కుక్

గజ్వేల్ అసెంబ్లీ అభ్యర్థిగా మూడోసారి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ దళపతి కేసీఆర్ గజ్వేల్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మర్కుక్ మండల కేంద్రంతో పాటు 15 గ్రామాల నుంచి బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి, ఎంపీపీ పాండు గౌడ్, జెడ్పిటిసి మంగమ్మ రామచంద్రం, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు కృష్ణ యాదవ్, ఆయా గ్రామాల సర్పంచులు గ్రామ శాఖ అధ్యక్షుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. సీఎం సభకు తరలి వెళ్ళిన వారిలో ఆయా శాఖల డైరెక్టర్లు ఎంపీటీసీలు ఉప సర్పంచులు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు

టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని నర్మేట గ్రామం మాజీ సర్పంచ్ మంకాల యాదగిరి మంగళవారం టీడీపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీకి రాజీనామా చేసి మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ సర్పంచ్‌తో పాటు కమ్మరి మల్లేశం, ఎరుకలు శంకరయ్య, దమ్మ కపల్లి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నమూనా ఈవీఎంతో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-తొగుట

బీఆర్ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు నమూనా ఈవీఎంతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంగళవారం మండలంలోని కాన్గల్ గ్రామంలో నమూనా ఈవిఎంతో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలతో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ప్రతి ఒక్కరు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మూడవ సారి అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. కొత్త ప్రభాకర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిక



నవ తెలంగాణ-దుబ్బాక

అక్బర్ పేట భూంపల్లి మండలంలోని చిన్న నిజాంపేట మాజీ సర్పంచ్ కొలుపుల బాలమల్లు మంగళవారం కాంగ్రెస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. బాలమల్లు మాట్లాడుతూ చెరుకు శ్రీనివాస్ రెడ్డి విజయం కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, అక్బర్ పేట భూంపల్లి మండలాధ్యక్షుడు అక్కపల్లి బాల్ నర్సాగౌడ్, ఉపాధ్యక్షుడు గజబింకార్ అశోక్, ప్రధాన కార్యదర్శి కోనపురం బాలు, గ్రామాధ్యక్షుడు బాలరాజు, సీనియర్ నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి, గుట్టయ్య తదితరులున్నారు.

ఆవుల...భూకబ్జా .. భూమి ఇయ్యకపోతే ఆత్మహత్య చేసుకుంటం

పెద్దలకు బాధితురాలు ఫిర్యాదు

నవతెలంగాణ - నర్సాపూర్

నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి భూ కబ్జాకు పాల్పడిండని బాధితురాలు వాటూరి రాజమణి ఆవేదన వ్యక్తం చేశారు. అయ్యా మసాయిపేట్ ఆవుల రాజిరెడ్డి మా భతుకులు ఆగం చేసినావు అంటూ రోదిస్తుంది. మాకూ ఉన్నటువంటి 19 గుంటల భూమిలో నువ్వు 5 గుంటల భూమిని కబ్జా చేసావు కదయ్యా అంటూ రాజిరెడ్డి పై మండిపడింది. కబ్జా చేసిన భూమిని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. లేకుంటే రాజిరెడ్డి పేరు మీద పెట్రోల్ పోసుకొని తన కొడుకు, కోడలు, మన్మడు, మన్మరాలు మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుని చస్తాం అంటూ హెచ్చరిస్తుంది. మా భూమి మాకు ఇవ్వాలి అని అందరికి పిర్యాదు చేస్తోంది. నా బాధ చెపుతున్నానని ఈ రోజు నా భూమిని కబ్జా చేసినట్టే రేపు మీ భూములని కూడా అముతాడు అని నియోజక వర్గం ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేసింది. అదే కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్లే విట్టల్ రెడ్డి మసాయిపేటలో యూత్ క్లబ్ ఉన్నటువంటి భూమిని కూడా అమ్మినరు గట్ల వుంది రెడ్డీలా రాజకీయం అని ఆమె విమర్శించింది. కాంగ్రెస్ పాలన అంటే బేకర్ పాలన అని, కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి కబ్జా కోరుడు అంటూ ఆమె తీవ్రస్థాయిలో మండిపడింది.

దుబ్బాక గడ్డ బీఆర్ఎస్‌కు అడ్డ



నవ తెలంగాణ- రాయపోల్

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపు ఖాయమని, దబ్బాక గడ్డ బీఆర్ఎస్ కు అడ్డ అని రాష్ట్ర నాయకులు మామిడి మోహన్ రెడ్డి,రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజిరెడ్డి, మండల ఇన్చార్జి కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో బీజేపి, బీఎస్పీ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపుతోనే దుబ్బాక అభివృద్ధి సాధ్యమవతుందని, బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పథకాలను సమవుజ్జిగా ప్రవేశ పెడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుందన్నారు. దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవాలంటే కారు గుర్తుకు ఓటు వేసి కొత్త ప్రభాకర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు సత్యం,గ్రామ అధ్యక్షులు బాల్ నర్స్,నాయకులు మంతుర్ యాదగిరి గౌడ్, రాజారాం, మధు, ఎల్లం, స్వామి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలి



ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్ కుమార్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్ కుమార్ హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దుకాణాలలో తిరుగుతూ తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. హెూటల్‌లో దోస వేసి ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి చూసి మరోసారి తనకు ఓటేసి గెలిపించాలని కోరారు.

ప్రలోభాలకు తెరలేపిన నాయకులు



నవ తెలంగాణ - సిద్దిపేట

నెల రోజులపాటు హోరాహోరీగా కొనసాగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలతో సమాప్తం అయింది. రాజకీయ నాయకుల సభలు, సమావేశాలు, ప్రచార వాహనాలు, పార్టీల పాటలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఈసీ నిబంధనల ప్రకారం పోలింగ్ సమయానికి 48 గంటల ముందే ప్రచారాన్ని నిలిపివేయాల్సి ఉంటుంది. పోలింగ్ గురువారం జరగనుండడంతో మంగళవారం సాయంత్రం ప్రచారం ముగించాల్సి ఉంటుంది. దీంతో మిగిలిన అతికొద్ది సమయాన్ని తమకు అనుకూలంగా చేసుకోవాలని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే 144 సెక్షన్ అమల్లోకి వస్తుంది. 48 గంటల పాటు మద్యం దుకాణాలను మూసేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. మంగళవారం సాయంత్రం నుంచి పోలింగ్ ముగిసే సమయం వరకు ఎలాంటి ప్రచారానికి వీలుండదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు అక్కడి ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వెళ్లాల్సి ఉంటుంది. టీవీలు, సోషల్ మీడియాలో ఎలాంటి ప్రకటనలు ఇవ్వకూడదు. పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలనుకుంటే ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

నాయకుల చివరి ప్రయత్నాలు

ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు అన్ని పార్టీలు తమ చివరి ప్రయత్నాలను మొదలుపెట్టాయి. ఇన్ని రోజులు ఇంటింటి ప్రచారం చేసిన నాయకులు, ఇప్పుడు ప్రజలను, మహిళలను, యువతను ఆకట్టుకోవడానికి వారికి అవసరమగు వస్తువులను ఇచ్చి, తమ వైపు తిప్పుకోవడానికి ప్రలోభాలకు తెర లేపారు. మహిళలకు కానుకలు, పురుషులకు డబ్బులు, మందు బాటిళ్లు ఇవ్వడానికి నాయకులు సిద్ధమవుతున్నారు. మంగళవారం రాత్రి, బుధవారం ఈ రెండు రోజులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఆయా పార్టీలు తమ ప్రయత్నాలను మొదలుపెట్టాయి. అధికారులు వీటిని అరికట్టడంలో ఎంతవరకు విజయం సాధిస్తారో చూడాల్సిందే.

బీజేపీ, బీఆర్ఎస్‌లకు రాహుకాలం



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ దుబ్బాక రూరల్ / మిరుదొడ్డి

'ప్రస్తుతం దుబ్బాకలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకి రాహుకాలం నడుస్తోంది. చేతి గుర్తుకు ఓటేస్తే దుబ్బాక పట్టిన రాహుకాలం పోతది. ఈసారి తనకు ఓటేసి గెలిపిస్తే ముత్యంరెడ్డి కలలుగన్న పాలన ప్రజలకు అందిస్తా' అని కాంగ్రెస్ దుబ్బాక అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని నగరం, తాళ్ళ పల్లి, పోతారెడ్డిపేట, చిన్ననిజాంపేట, రామేశ్వరంపల్లి, కూడవెల్లి, అక్బర్ పేట్ గ్రామాల్లో చెరకు శ్రీనివాస్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు మహిళలు మంగళ హారతులు పట్టి కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన రోడ్‌షోలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందన్నారు. నోటిఫికేషన్ వేసిన పేపర్ లీకులు, లీకేజీలతో పాటు ప్రాజెక్టుల పేరు మీద అక్రమంగా కేసీఆర్ వేల కోట్లను సంపాదించారని ఆరోపించారు. మూడేళ్లలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాయమాటలతో గెలిచి ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ పార్టీలు ఒకటేనని, మరోసారి ఆ పార్టీలకు ఓటేసి మూడోసారి మోసపోవద్దన్నారు. 4 నెలల్లో 160 గ్రామాలు తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నానని, తాను ఎమ్మెల్యేగా గెలిచినా తర్వాత నియోజకవర్గంలో 10,261 ఇండ్లు కట్టిస్తానని, అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీ అమలు చేస్తామని అన్నారు. మీ కష్టాలు తెలిసిన వ్యక్తిగా ముత్యంరెడ్డి పాలన అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాతూరీ వెంకట స్వామి గౌడ్, మహిళ అధ్యక్షురాలు కూతురు సుమలత చందు, మండల అధ్యక్షులు అక్కపల్లి బాల్ నర్స గౌడ్, ఉపాధ్యక్షులు గజభింకర్ అశోక్, కోనపురం బాలు,గ్రామ అధ్యక్షులు తదితరులు ఉన్నారు

ప్రజల సేవకే నా శేష జీవితం అంకితం



బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

నవ తెలంగాణ -దుబ్బాక

దుబ్బాక ప్రజల సేవకే తన శేష జీవితం అంకితమని మీ కష్ట సుఖాల్లో తోడుంటానని, ఆశీర్వదించి అక్కున చేర్చుకోండని బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతోనే బతికి బయటపడ్డానని, బతికున్నంత కాలం దుబ్బాక ప్రజలకు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30 న జరిగే ఎన్నికల్లో ఒకటో నెంబర్ కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి,ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి,జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి,ఏఎంసీ చైర్ పర్సన్ చింతల జ్యోతి కృష్ణ,పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాష్,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోలిపేట సతీష్ రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి బాధ్యత నాదే

నవ తెలంగాణ - రాయపోల్

తెలంగాణ రాష్ట్ర ఏర్పడక ముందు అభివృద్ధి ఉమ్మడి జిల్లాలు, మండలాలు ఉన్నప్పుడు అభివృద్ధి ఎలా ఉంది? ప్రస్తుతం అభివృద్ధి ఎలా ఉందో ప్రజలందరూ గమనించాలని, రాయపోల్ మండలం సంపూర్ణ అభివృద్ధి బాధ్యత నాదే అని మెదక్ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాయపోల్ మండలం తిమ్మక్ పల్లి, రాయపోల్ గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన రాయపోల్ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాల నిర్మించడానికి కృషి చేస్తానన్నారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రభుత్వ భూములను కేసీఆర్ తీసుకుంటాడని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే జనవరి మాసంలో రాయపోల్ మండల కేంద్రంతో పాటు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇస్తూ రైతులను యజమానులుగా చేస్తామన్నారు. మండల కేంద్రంలో ఉన్న సర్కార్ తోట భూ వివాదాన్ని పరిష్కారం చేసి గ్రామానికి చెందిన విధంగా కృషి చేస్తానన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేకే సూరంపల్లి గ్రామంలో తనపై కత్తితో దాడి చేశారన్నారు. ఎన్ని కుట్రలు చేసిన దుబ్బాకలో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి యాదగిరి, ఏఎంసీ చైర్మన్ ఇప్ప లక్ష్మి, మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, రాష్ట్ర నాయకులు మామిడి మోహన్ రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ శ్రీనివాస్ గుప్త, గ్రామ సర్పంచ్ లు మౌనిక రాజిరెడ్డి, నిర్మల రాజిరెడ్డి, ఉప సర్పంచ్ సత్తమ్మ, వార్డు సభ్యులు శ్రీనివాస్, రాజు గౌడ్, నాయకులు జగపతి రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ఇప్ప దయాకర్, గ్రామ అధ్యక్షులు స్వామి,పలేంద్రం, మాజీ సర్పంచ్ రమేష్, బచ్చు శివ, పెయింటర్ రవి, గణేష్, మాజీ ఎంపీటీసీ రాజు గౌడ్, సతీష్ పాల్గొన్నారు.

గౌరవెల్లిలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి గ్రామంలో నేషనల్ లేబర్ కోపరేటివ్ డైరెక్టర్ దండగుల రాజలక్ష్మి, రామవరం గ్రామంలో జడ్పిటిసి భూక్యమంగా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 30న హుస్నాబాద్ నియోజకవర్గంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీష్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు మెండుగా ప్రజల చెంతకు చేరుతున్నాయని, ఒకప్పటితో పోలిస్తే నియోజకవర్గం చాలా అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ పార్టీ 50 సంవత్సరాల అధికారంలో చేసిన అభివృద్ధి ఏ విధంగా ఉందో 9 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి ఏ విధంగా ఉందో ప్రజలు పరీక్షించుకొని చూసి ఓటు వేయాలన్నారు. ఏది ఏమైనా హుస్నాబాద్ గడ్డమీద గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని మళ్లీ సతీష్ కుమార్ గెలుస్తారని ప్రజలు బహిర్గతం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సూరంపల్లి పర్శరాములు, యాస శ్రీనివాస్, ఈసంపల్లి రవీందర్,ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్,గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడబోయిన మధుసూదన్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బైరగోని శ్రీనివాస్, మజ్జిగ మధు, మజ్జిగ ప్రదీప్, జంగపల్లి రవి, సూరంపల్లి సత్యనారాయణ, సాధు ప్రతాపరెడ్డి, రెక్కల వెంకటరెడ్డి, లింగాల నరసింహులు, గంగాధర్, రాజన్న, ఓలాద్రి మహేష్ రెడ్డి, గణేష్ రెడ్డి, రాజు ప్రకాష్ రెడ్డి లతోపాటు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రోడ్ షోకు తరలిన నాయకులు



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ అభ్యర్థి,మంత్రి హరీష్ రావు హాజరైన రోడ్ షోకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. వివిధ గ్రామాల్లో నుంచి బైక్‌లపై ర్యాలీ తీస్తూ సిద్దిపేటకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, జడ్పిటిసి తడిసిన ఉమా,రైతు బంధు సమితి మండల అధ్యక్షులు బద్దిపడగ కృష్ణారెడ్డి, సోసైటీ చైర్మన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాగుల సారయ్య, సీనియర్ నాయకులు దువ్వల మల్లయ్య, కూతురు రాజిరెడ్డి, కోమండ్ల రామచంద్రారెడ్డి, పద్మారెడ్డి, బీఆర్ఎస్ యూత్ విభాగం అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, విద్యార్థి విభాగం అధ్యక్షులు గోవిదారం రవి,తాజా, మాజీ ప్రజాప్రతినిధులు,బూత్ లెవల్, వంద ఓట్ల ఇంచార్జులు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గల్లీల బాధలు ఢిల్లీలో ఉన్నోళ్లకేం తెలుసు

- కష్టం ఎక్కడుందో కేసీఆర్‌కు తెలుసు
- మెదక్ ప్రజలకు అండగా ఉంటా..ఆశీర్వదించండి
- కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



నవతెలంగాణ - మెదక్

గల్లీ బాధలు ఢిల్లీలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకేం తెలుసని, ప్రజలకు కష్టం ఎక్కడుందో సీఎం కేసీఆర్‌కే తెలుసని మెదక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ సాధించుకున్న తెలంగాణను తెర్లు కావొద్దని సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని, 55 ఏళ్లు, 11సార్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్, తాగు, సాగు నీటి కష్టాలు చూశామన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కరెంట్, తాగు, సాగు నీటి కష్టాలు తీరిపోయాయని తెలిపారు. తెచ్చుకున్న తెలంగాణాను తెర్లు చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతున్నట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి కరెంట్ వద్దని అంటున్నారని, మూడు గంటల కరెంట్ వ్యవసాయానికి సరిపోతదా అని ప్రశ్నించారు. మెదక్ నియోజకవర్గం దశలవారీగా అభివృద్ధి చెందుతోందన్నారు. జిల్లా ఏర్పాటు చేసుకోవడంతో పాటు కలెక్టరేట్, ఎస్పి, లైబ్రరీ, దవాఖానలు బాగుచేసుకున్నామని తెలిపారు. రూ. 180 కోట్లతో 500 పడకల హాస్పిటల్‌ను, నర్సింగ్ కాలేజ్ ఏర్పాటు చేసుకోబోతున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా 5 లక్షలు వచ్చేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మెదక్ అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. రూ. 305 కోట్లతో రింగ్ రోడ్డు ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలిపారు. మెదక్‌లో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మైనంపల్లి హన్మంతరావు ఏం అభివృద్ధి చేశారని తెలిపారు. మెదక్ నచ్చలేదని మల్కాజ్ గిరి వెళ్ళి పదేళ్ల తరువాత 25 ఏళ్ల కొడుకును సంకల వేసుకొని మళ్లీ మెదక్ వచ్చి ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. రోహిత్‌కు ఏం తెలుసని నియోజకవర్గని అప్పగించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి ధన బలం ఉంటే తనకు జన బలం ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. తనను ఆడ బిడ్డగా ఆశీర్వదించి మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, పట్టణ అధ్యక్షుడు గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్లు రాగి వనజ, మామిళ్ల ఆంజనేయులు, శ్రీధర్ యాదవ్, మధుసూదన్, సమియుద్దిన్ పాల్గొన్నారు.

నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ చేర్యాల

జనగామ నియోజకవర్గంలోని మండల, గ్రామాల సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక రూపొందించి ప్రగతి భవన్ నుంచి నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణ కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి చుంచనకోట క్రాస్ వరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా చేర్యాల పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి, వారి కుటుంబం చేసిన దురాగాతలకు, అక్రమాల డొల్లతనం బయటపడిందన్నారు. 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి సీఎం కేసీఆర్ ప్రమాణం స్వీకారం చేయగానే నెల రోజుల్లోనే చేర్యాల రెవెన్యూ డివిజన్ జీవో తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో సారు మాటగా.. కారు బాటగా నిలుస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మరో రెండు రోజులు బీఆర్ఎస్ శ్రేణులు కష్ట పడాలని, సోషల్ మీడియాను ఉపయోగించుకొని బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర నాయకులు మండల శ్రీరాములు, బాలనర్సయ్య, చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకటరెడ్డి కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరొకసారి ఆశీర్వదించండి



బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్‌కుమార్

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ తొమ్మిదిన్నర ఏళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి.. మరొకసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ కోరారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తా నుంచి మార్కెట్ యార్డు వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో జరిగిన అభివృద్ధిని 2023 బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ, బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటెయ్యాలని హుస్నాబాద్ ఎమ్మెల్యేగా మూడోసారి తనను గెలిపించాలని సతీష్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ శాసనసభ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సైనికులా పని చేశారని, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ 2023 బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలందరికీ అవగాహన కల్పించారని తెలిపారు. హుస్నాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగరేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, మార్కెట్ చైర్మన్ ఎడబోయిన రజిని, పట్టణ అధ్యక్షుడు అన్వర్, కౌన్సిలర్లు, టిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

దేశంలో లేని పథకాలు తెలంగాణలో అమలు



నవతెలంగాణ-తొగుట

దేశంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్నాయని సర్పంచ్ దామరంచ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లన్నసాగర్ ముంపు గ్రామం ఆర్ అండ్ ఆర్ కాలనీ, ఏటీగడ్డ కిష్టాపూర్ గ్రామంలో వివిధ కుల సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు మరోసారి ఓటు వేసి మూడోసారి సీఎంగా గెలిపించుకోవాలని అన్నారు. దళితుల కుటుంబాలకు కేసీఆర్ ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. అనంతరం కుల సంఘాల సభ్యులు మాట్లాడుతూ మన అందరం ఏకమై భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కుల సంఘ పెద్దలు లింగం, రాజు, కనకయ్య, అంజయ్య, నాంపల్లి, కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్షన్నర మెజార్టీతో హరీశ్‌రావు గెలుపు ఖాయం



నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

లక్ష 50 వేల మెజార్టీతో హరీశ్‌రావు గెలుపు ఖాయమని సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ బైకు రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి రామచంద్రరావు, జెడ్పిటిసి శ్రీహరి గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఎర్ర యాదయ్య, సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు ,ఎంపిటిసిలు , బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బీఆర్ఎస్వి మండల నాయకులు, ఉప సర్పంచులు వార్డు సభ్యులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

అత్త విజయం కోసం కోడళ్ల విస్తృత ప్రచారం



నవతెలంగాణ -వెల్దుర్తి : నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి విజయం కోసం కోడలు కీర్తి రెడ్డి మంగళవారం పలు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తి రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. గతంలో రెండు పర్యాయాలు నర్సాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉండి అభివృద్ధి పనులను నిర్వహించారన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి మరింత అభివృద్ధి చేసుకునేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



నవతెలంగాణ-నర్సాపూర్ : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీత రెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని చైతన్యపురి కాలనీ, పెద్దమ్మ కాలనీలో సునీతా రెడ్డి కోడల రూత్విక శశిధర్ రెడ్డి, కౌన్సిలర్ సునీత బాల్రెడ్డిలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సునీతారెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సూరారం నరసింహులు, దావూద్, ఆశన్నగారి శ్రీశైలం యాదవ్, నాగేష్, గోవర్ధన్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెరుకు శ్రీనివాస్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-తొగుట

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని పెద్ద మసాన్ పల్లి గ్రామంలో నమూనా ఈవీఎంతో ఇంటింటా ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ స్కీములను ప్రజలకు అందిస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రతి ఒక్కరికి అన్ని విధాలుగా సహకారం అందుతుందని చెప్పారు.

దుబ్బాకలో ప్రభాకర్‌రెడ్డి విజయం ఖాయం



నవతెలంగాణ -దుబ్బాక

అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపు ఖాయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బడుగు రాజు, నందాల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం దుబ్బాక పురపాలిక పరిధిలో లచ్చపేట 10, 11వ వార్డుల్లో బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు కూరపాటి వెంకటేష్, మోహన్, పురుషోత్తం, గౌరీనాథం పలువురున్నారు.

ఎన్నికలు సజావుగా సాగాలి



నవతెలంగాణ-మిరుదొడ్డి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో డ్రోన్ కెమెరాల ద్వారా గ్రామ పరిసరాలను పర్యవేక్షించడం జరిగిందన్నారు. ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు. డ్రోన్ కెమెరా ద్వారా ప్రతి వీధిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎవరైనా ఓటర్లకు డబ్బులు, మద్యం, గిఫ్ట్ పంపించేసినట్లయితే డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ నిఘా నేత్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

మార్పు కోసం బీజేపీకి ఓటేయండి



నవతెలంగాణ-మర్కుక్

మార్పు కోసం గజ్వేల్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ మర్కుక్ మండల ఇంచార్జి మాజీ జెడ్పీటిసి సింగం సత్తయ్య అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మర్కుక్ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మండల బీజేపీ ఇంచార్జి మాజీ జడ్పీటిసి సింగం సత్తయ్య, మండల అధ్యక్షుడు రమేష్‌తో కలిసి ప్రచారం నిర్వహిస్తూ బిజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. మండల బీజేపీ నాయకులు రమేష్, రాజేందర్ సింగ్, తిరుపతిరెడ్డి, రాంరెడ్డి, శంకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, కొమురయ్య, నర్సింలు, శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులున్నారు.

ఆటో ఎక్కిన ఏనుగు



నవతెలంగాణ-దుబ్బాక

బహుజన సమాజ్ పార్టీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి సల్కం మల్లేష్ యాదవ్ వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. భారీ ఏనుగు బొమ్మను ప్రత్యేకంగా తయారు చేసి ఆటోకు బిగించారు. ఏనుగు గుర్తుకు ఓటేయాలని కోరుతున్నారు. ఏనుగు ఆటో ఎక్కిందా అని అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నవతెలంగాణ -మర్కుక్



ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఒకవేళ ఉల్లంఘిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని మర్కుక్ ఎస్ఐ డి.శంకర్ హెచ్చరించారు. పోలింగ్ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని వైన్ షాపులను మూసివేయాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. పోలింగ్ కేంద్రాలలోకి స్మార్ట్ ఫోన్, సెల్ఫీలు అనుమతులు లేవన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఆయుధాలు, బాణా సంచాలు, స్మార్ట్ వాచ్లకు కూడా అనుమతి లేదని చెప్పారు. డబ్బు మద్యం ఇతర ప్రలోభాలకు గురి చేయొద్దన్నారు. ఇద్దరు లేదా ముగ్గురు కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండొద్దన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం సతీమణి ప్రచారం

నవతెలంగాణ-దుబ్బాక



బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి మంజులతరెడ్డి మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రం లోని 1, 12, 13, 14 వార్డుల్లో జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి లతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. సీఎం కేసీఆర్ సర్కారు హయాంలో దుబ్బాకలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ప్రభాకర్ రెడ్డిని భారీ మెజారి టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కౌన్సిలర్లు నిమ్మ రజిత, బట్టు యాదమ్మ ఎల్లం,ఆస సులోచన స్వామి,ఆస యాదగిరి, ఏఎంసీ మాజీ చైర్ పర్సన్ బండి శ్రీలేఖ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండి రాజు పాల్గొన్నారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం

మిరుదొడ్డి :

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గం బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి విజయం కోసం ముదిరాజ్ సంఘ కులస్తులు మంగళవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తాను గెలిచిన అనంతరం సంఘం అభివృద్ధికి తోడ్పడుతాను అందిస్తానని తెలిపారు. ముదిరాజులతో పాటు గ్రామంలో ఉన్న అన్ని కులాలను అభివృద్ధి చేయడానికి ముందున్నానని అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సొసైటీ చైర్మన్ ఉడిధి రాజు, ముదిరాజ్ సంఘ కుల పెద్దలు నీల నర్సింలు, పర్శరాములు, మాజీ ఎంపీటీసీ ఉల్లెంగల నవ్య నరేష్, వార్డ్ సభ్యులు పంజ చంద్రం, దండు బలపోషయ్యా, బైరి కిష్టయ్య, గంగరమైన స్వామి, నీల శేకర్, పున్యమైన కృష్ణాహరి, బైరి నందు, కొరిమి సంతోష్, నర్సింలు, నరేష్, ప్రవీణ్, ఉడిది యేసు, సన్నిత్, ముదిరాజ్ కులస్థులు, పలువురు ఉన్నారు.



గుండారం గ్రామాభివృద్ధికి కృషి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ-బెజ్జంకి



గుండారం గ్రామాభివృద్ధికి శాయశక్తుల కృషి చేశానని.. రానున్న రోజుల్లో మరింత గొప్పగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం మండల పరిధి లోని గుండారం గ్రామంలో మానకొండూర్ నియోజకవర్గ అభ్యర్థి రసమయి బాలకిషన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ గత పదేండ్లుగా గుండారం గ్రామంలో అశ్రయం కల్పించుకుని ప్రజాసేవ చేస్తుంటే గ్రామస్తు లందరూ తనను కుటుంబ సభ్యుడిగా అదరించారని, ఎల్లమ్మ గుడి ముందు పోతరాజు ఎలా రక్షణగా ఉంటాడో.. ఆ విధంగా గుండారం గ్రామానికి నేనే పోత రాజులా రక్షణగా ఉంటానని, బతికినా.. మృతిచెందినా ఈ గుండారం గ్రామంలో నే సమాధి ఉంటదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో మీ ఊరి మనిషిగా గుర్తించి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని గ్రామస్తులను కోరారు. మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఒగ్గు కథ చెప్తూ వినూత్న రీతిలో బీఎస్పీ ప్రచారం

నవతెలంగాణ -దుబ్బాక/ దుబ్బాక రూరల్



బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి సల్కం మల్లేష్ యాదవ్‌కు మద్దతుగా ఒగ్గు కథ చెప్పిస్తూ వినూత్న రీతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం దుబ్బాక మండల పరిధిలోని పోతారంలో ఒగ్గు కళాకారులతో ఒగ్గు కథ చెప్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను వివరించారు. బీఎస్పీతోనే బహుజనలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ఒగ్గుకథను వీక్షించారు. అనంతరం సల్కం మల్లేష్ యాదవ్‌ను ఇదే గ్రామానికి చెందిన సమ్మిరెడ్డి నీలంరెడ్డి శాలువాతో సన్మానించారు. ఏనుగు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని మల్లేశ్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. బహుజన సమాజ్ పార్టీ దుబ్బాక మండలాధ్యక్షుడు సుద్దాల రాజు, సీనియర్ నాయకులు మ్యాదరి నర్సింలు, వినీత్ పలువురున్నారు.

పతి గెలుపు కోసం సతి ప్రచారం



నవతెలంగాణ-బెజ్జంకి: మానకొండూర్ నియోజ కవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనా రాయణకు మద్దతుగా ఆయన సతీమణి డాక్టర్ అనురాధ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, రెడ్డి రాజు, ముక్కీస శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ గ్రామశాఖ అధ్యక్షుడు బోనగిరి శంకర్, నాయకులు తాడిశెట్టి రాజయ్య, కొమ్ము రవి పాల్గొన్నారు.

వాడవాడలా బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-మద్దూరు



మద్దూరు మండలంలోని పలు గ్రామాలలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో వాడవాడటా తిరుగుతూ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, పదేళ్ల పరిపాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలో అగ్రస్థానంలో నిలిపారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, ఉప సర్పంచ్ మేక మాధవి గోపాల్, గ్రామ శాఖ అధ్యక్షుడు చెవిటి మహేష్, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు మేక మహేష్, నాయకులు పుప్పాల బాలస్వామికనకయ్య, పండరి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని తుంగలోకి తొక్కిన మంత్రి

నవతెలంగాణ-సిద్దిపేట

ఎన్నికల ఖర్చు విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి హరీశ్‌రావు ఎన్నికల నియమావళిని తుంగలోకి తొక్కినట్లు బీఎస్పీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చక్రధర గౌడ్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రూ.40 లక్షల ఖర్చులకు పరిమితులు ఉండగా, దాదాపు రూ.4 కోట్లు మంత్రి ఖర్చు చేసినట్లు తెలిపారు. విచ్చలవిడితనం పెరిగిపోయిందన్నారు. ఎన్నికల అధికారి కార్యాలయ ంలో సీసీ కెమెరాలు రాత్రుళ్లు ఎందుకు పనిచెయ్యట్లేదని ప్రశ్నించారు. బ్యాలెట్ ఓట్లను దొంగిలించే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ అన్ని అవకతవకలపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అన్ని అరాచకాలు ఆగాలంటే, సామాజిక న్యాయం జరగాలంటే బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు, ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బహుజనులకు బీఎస్పీ అండ

నవతెలంగాణ-దుబ్బాక



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ందరికీ అండగా బీఎస్పీ జెండా ఉంటుందని బహుజన సమాజ్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు జింక సంజీవ్ అన్నారు. బీఎస్పీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి సల్కం మల్లేష్ యాదవ్‌కు మద్దతుగా మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో, మండల పరిధిలోని చిట్టాపూర్, రాజక్కపేట గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు అగ్రవర్ణాల నాయకుల చేతుల్లోనే ఉన్నాయని, ఆ పార్టీలతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎప్పటికీ న్యాయం జరగదని అన్నారు. బీఎస్పీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి అనాజిపూర్ సంజీవ్, ఉపాధ్యక్షుడు నగరం రమేష్, కోశాధికారి ఎడ్ల శంకర్, ప్రధాన కార్యదర్శి బొల్లం రాజేష్ పాల్గొన్నారు.

మార్పు కోసం బీఎస్పీకి ఓటు వేయండి

నవతెలంగాణ-దుబ్బాక



దుబ్బాక అభివృద్ధి మార్పు కోసం బహుజన సమాజ్ పార్టీకి ఓటు వేయండని ఆ పార్టీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి సల్కం మల్లేష్ యాదవ్ కోరారు. బీఎస్పీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి సల్కం మల్లేష్ యాదవ్‌కు మద్దతుగా మంగళవారం దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్ మండలాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం బహుజన సమాజ్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు జింక సంజీవ్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రధాన పార్టీలు టికెట్ల కేటాయింపులో సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని, జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న బహుజనులను కేవలం జెండాలు కట్టిందుకే వినియోగించుకుంటున్నారని మండిపడ్డారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఏనుగు గుర్తుపై ఓటు వేసి బహుజన సమాజ్ పార్టీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బీఎస్పీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి అనాజి పూర్ సంజీవ్, ఉపాధ్యక్షుడు నగరం రమేష్, కోశాధికారి ఎడ్ల శంకర్, ప్రధాన కార్యదర్శి బొల్లం రాజేష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకం

- ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే సహించేది లేదు
- రానున్న 48 గంటలు అతిముఖ్యం
- డబ్బు, మద్యం అక్రమ రవాణాకు తావులేదు
- ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలెక్షన్స్ ప్రథమ కర్తవ్యం
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజాస్వామ్యదేశంలో ఎన్నికల ప్రక్రియ చాల కీలకమైనదని.. ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలెక్షన్స్ వారి ప్రథమ కర్తవ్యం అని తెలిపారు. సంగారెడ్డి గోకుల్ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమంలో సార్వత్రిక ఎన్నికల విధులకు వచ్చిన సెంట్రల్ ఆర్మ్డ్ ఫోర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రాముఖ్యతను వివరించారు. ఎన్నికల విధులు ఏవిధంగా పకడ్బందీగా నిర్వహించాలి, సిబ్బంది చేయాల్సిన, చేయకూడని విధుల గురించి క్షుణ్ణంగా వివరించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలి వెళ్లొద్దన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని, అనవసర విషయాలు చర్చించొద్దన్నారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో పోలింగ్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్‌ఫోన్‌లు, మందుగుండు సామాగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూతు లోనికి తీసుకొళ్లద్దని, సెల్ఫీలు దిగడం నిషేదం అని చెప్పారు. పోలింగ్ ముగిసిన తరువాత ఉన్నతాధికారాలు ఆదేశాలు లేనిదే ఎవ్వరూ కూడా తమ విధులనుండి వెళ్లొద్దన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించే పోలీసులకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ అమూల్యమైన ఓటును ఫ్రీ అండ్ ఫెయిర్‌గా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు, సంగారెడ్డి డీఎస్పీ రమేష్ కుమార్, సబ్-డివిజన్ సిఐలు శ్రీధర్ రెడ్డి, చంద్రయ్యా, సుధీర్ కుమార్, నాగరాజు, ఎస్సైలు వివిధ జిల్లాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచారంలో ప్రజల ఆదరణ అద్భుతం..

నవతెలంగాణ-జహీరాబాద్

గత రెండున్నర నెలలుగా చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి అద్భుతమైన ఆదరణ దక్కిందని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీఎస్ ఐడీసీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, ఎన్నికల పరిశీలకులు దేవి ప్రసాద్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతీగ్రామంలో గడపగడప నుంచి వచ్చిన ఆదరణ తన జీవితంలో మర్చిపోలేనన్నారు. ఇదే ఆదరణతో ఎన్నికల్లోనూ కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గుండప్ప యాదవ్, మహంకాళి శుభాష్ తదితరులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో భూపాల్‌రెడ్డి, శ్రియోరెడ్డి ప్రచారం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఈ ఎన్నికల్లో మరోమారు కారు గుర్తుకే పట్టం గట్టాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, శ్రియారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఖేడ్ మండలంలోని పంచాంగమా, మనూరు మండలంలోని పులకుర్తి నారాయణఖేడ్ పట్టణంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, రాజీవ్‌చౌక్ వద్ద శ్రియోరెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కేసీఆర్ పాలనలో ఘనమైన అభివృద్ధి జరిగిందన్నారు. ఈ అభివృద్ధి ఇలానే కొనసాగాలంటే మరోమారు కారు గుర్తుకే ఓటేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఖేడ్ పట్టణంలో బీఆర్‌ఎస్ యూత్ ఆధ్వర్యంలో కింగ్స్ ప్యాలెస్ నుంచి రాజీవ్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన సుమారు 100 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మున్సిపల్ చైర్మెన్ రుబీనా నజీబ్, పట్టణ కౌన్సిలర్లు నర్సింలు, విజయ్ బుజ్జి నగేష్ స్టేట్ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న అభివృద్ధిని ఆశీర్వదించండి

నవతెలంగాణ-పటాన్‌చెరు

ఈ అసెంబ్లీ ఎన్నికలలో కారు గుర్తుపై ఓటు వేసి పటాన్‌చెరు ప్రగతిని కొనసాగించాలని బీఆర్ఎస్ పటాన్‌చెరు అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన మంగళవారం బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి జీఎంఆర్ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించిన రోడ్డు షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల కష్టనష్టాల్లో అండగా ఉంటూ ఇంటింటికి సంక్షేమ పథకాలు.. గ్రామ గ్రామాలకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన బీఆర్ఎస్‌ను నిండు మనసుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. 60 ఏండ్ల పాటు రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ, మతతత్వ నినాదంతో గద్దెనెక్కిన బీజేపీలను ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రైతుబంధు విడుదలను అడ్డుకున్న కాంగ్రెస్



పార్టీకి గట్టి బుద్ధి చెప్పాలని కోరారు. రాయి ఏదో రత్నం ఏదో ప్రజలు గమనించాలని, ఆలోచించి ఓటు వేయకపోతే అభివృద్ధి సంక్షేమంలో ఆమడ దూరంలో నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, నాయకులు శంకర్ యాదవ్, సపాన దేవ్, పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓటింగ్‌కు పోలింగ్ కేంద్రాలు సిద్ధం

నవతెలంగాణ-న్యాల్‌కల్

రేపు(గురువారం) జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని.. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ రాజిరెడ్డి తెలిపారు. మండలంలో 62 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని.. 47,445 మంది ఓటర్లు ఉన్నారన్నారు. రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలతో పాటు.. వికలాంగులకు వీల్‌చైర్లు ఏర్పాటుచేశామన్నారు. పోలింగ్‌కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం





నవతెలంగాణ-హత్నూర

మండల పరిధిలోని బోర్పట్ల, రెడ్డి ఖానాపూర్, మల్కాపూర్, చందాపూర్, నస్తీపూర్ దౌల్తాబాద్, హత్నూర నవాబ్‌పేట్, మధుర బడంపేట్, బ్రాహ్మణగూడా, నాగుల్దేవ్ పల్లి తదితర గ్రామాల్లో నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి చివరిరోజైన మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రచారంలో ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నదన్నారు. కల్యాణ లక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, వృద్ధులకు వితంతులకు పింఛన్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. కాబట్టి కారు గుర్తుకే ఓటేసి మరోమారు బీఆర్ఎస్‌కే పట్టం గట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ దేవేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ చంద్రగౌడ్, ప్రాథమిక సహకార సంఘం చైర్మెన్‌లు దుర్గారెడ్డి దావెూదర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ టీసీ ఆంజనేయులు, ఎంపీపీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

తొగర్ పల్లిలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలో తొగర్‌పల్లి గ్రామంలో యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సందగళ్ళ సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, యువ వికాసం తదితర పథకాలతో పాటు ఏకకాలంలో రెండు లక్షల రూపాయలు రైతు రుణమాఫీ, ఆయా శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల గురించి ఓటర్లకు క్లుప్తంగా చెప్పారు. అందుకోసం ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌కు అండగా నిలవాలని.. చేతి గుర్తుపై ఓటేసి జగ్గారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా ఈవీఎం నమూనాలను చూయించి ఓటు వేసే విధానంపై ప్రజలను చైతన్యపరిచారు.

చివరి రోజు పోటాపోటీ ప్రచారాలు







నవతెలంగాణ-జోగిపేట

ఎన్నికల ప్రచారం చివరిరోజు కావడంతో మంగళ వారం ఆందోల్ నియోజకవర్గం జోగిపేట పట్టణంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులు పోటాపోటీ ప్రచారాన్ని చేపట్టారు. అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ తన మద్దతు దారులతో కలి సి జోగిపేట పట్టణంలోని ఆయా అవార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహి ంచారు. 10 ఏండ్ల కాలంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అందోల్ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజ నర్సింహ తన నాయకులతో కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో 10ఏండ్లుగా ప్రజలకు కేసిఆర్ చేసిందేమీ లేదని, కాంగ్రె స్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. అలాగే బీజేపీ అభ్యర్థి బాబుమోహన్ జోగిపేట పట్టణంలోభారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు.

పుల్కల్ : పుల్కల్ ఉమ్మడి మండలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



తమకంటూ తమకే ఓటు వేయాలని ఓటర్ల వద్దకు వెళ్లి ఈవీఎం బ్యాలెట్ నమూనా చూపి స్తూ అభ్య ర్థించారు. అయితే రాత్రి వేళల్లో కూడా గ్రామాల్లో రాజకీయం నడుస్తున్నదని.. ఆయా పార్టీల నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి



నవతెలంగాణ-కొండాపూర్

తెలంగాణలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే మరోమారు బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని మల్లేపల్లి ఎంపీటీసీ పల్లె రాందాస్ అన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమంలో సీఎం సహకారంతో బీఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్ అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. కాబట్టి మరోమారు కారు గుర్తుకే ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల టీమ్‌లు కేటాయింపు

నవతెలంగాణ-సంగారెడ్డి

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రేపు(గురువారం) జరిగే పోలింగ్ కోసం ఐదు నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలకు అవసరమైన అధికారులను, సిబ్బంది టీమ్‌లను కేటాయిం చినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. థర్డ్ రాండమై జేషన్ ప్రక్రియ ద్వారా టీమ్స్ కేటాయింపు జనరల్ అబ్జర్వర్ల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు నియో జకవర్గాల్లో ప్రత్యేక మహిళా పోలింగ్ కేంద్రాలు, పీడబ్ల్యూడీ, యూత్ మేనేజ్మెంట్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో పాటు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అబ్జర్వర్లకు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ సింగ్లా, పవన్‌కు మార్, నాజీమ్ జైఖాన్, అదనపు కలెక్టర్ మాధురి, మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి విజయ్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి జగదీశ్, ఎన్ఐసి డీఐఓ విద్యాసాగర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

30న వేతనంతో కూడిన సెలవు

నవతెలంగాణ-సంగారెడ్డి



అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈనెల 30న వేతనంతో కూడిన సెలవును ప్రభుత్వం ప్రక టించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. రేపు(గురువారం) అన్ని ప్రభుత్వ, ప్రభు త్వేతర సంస్థలకు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు దినంగా కలెక్టర్ ప్రకటించారు. ఎన్నికల నిర్వ హణలో భాగంగా ఈ నెల 29న కూడా సెలవు దినంగా ప్రకటిస్తూ స్థానికంగా ఉత్తర్వులు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠ శాలలు కళాశాలలు, విద్యాసంస్థలకు, ప్రభు త్వ సంస్థలకు నేడు,రేపు సెలవు దినంగా పేర్కొన్నారు.



రూ.9వేల కోట్లతో 'పటాన్‌చెరు'ను అభివృద్ధి

నవతెలంగాణ-రామచంద్రాపురం

పటాన్‌చెరు నియోజకవర్గాన్ని తొమ్మిదిన్నర ఏండ్లలో సుమారు రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పథంలో నడిపించా నని.. కాబట్టి ఈ ఎన్నికల్లో మరోమారు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రజ లకు విజ్ఞప్తి చేశారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని రామచంద్రాపురం లక్ష్మి గార్డెన్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ గెలుపు కోసం గత 52 రోజులు చేసిన కష్టం కంటే.. మరో 50 గంటలు అదనంగా పనిచేయాలని బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తమపై ప్రతిపక్ష పార్టీలు అసత్య ఆరో పణలు, విమర్శలు గుప్పిస్తున్నారన్నారని.. వాటిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు దిమ్మ దిరిగే విధంగా తీర్పు ఇవ్వడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నా రన్నారు. మూడోసారి ఓటర్లు బీఆర్ఎస్‌కే పట్టం కట్టి గెలి పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మె ల్సీ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరే టర్లు పుష్ప, సింధు మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపానాదేవ్, అంజయ్య, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ నాయకులు ఆదర్శ రెడ్డి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ ప్రాంతానికి చెందిన ఆసిఫ్(32) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెల్సుకున్న బీఆర్ఎస్ నాయకుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి మంగళవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి.. అంత్యక్రియల కోసం రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. కాగా ఆయనకు మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నా తుది శ్వాస వరకు మీతోనే..

నా కట్టె కాలేంత వరకు మీ మధ్యలోనే ఉంటా..

ఎన్నికల ముగింపు ప్రచారంలో

చింతా ప్రభాకర్ భావోద్వేగం.. కంటతడి



నవతెలంగాణ-సంగారెడ్డి

'నేను బతుకుతనో..! చనిపోతానో తెలియని పరిస్థితుల్లో నాకోసం మీరందరు ఆలయాల్లో పూజలు, చర్చిల్లో, మసీదుల్లో ప్రార్థనలు చేశారు. మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేనిది' అంటూ సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ భావోద్వేగానికి గుర య్యారు. తన తుది శ్వాస వరకూ మీతోనే ఉంటానని ప్రజలను ఉద్దేశించి చెబుతూ.. కంటతడి పెట్టారు. ఎన్నికల ప్రచారం ముగింపు రోజైన మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో.. ఐటిఐ నుంచి గంజీ మైదా నం వరకు గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ, పాదయాత్ర నిర్వహించారు. ఈ ర్యాలీలో చింతా ప్రభాకర్, కార్పొరేషన్ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొ న్నారు. ముందుగా.. ప్రచార రథం పైనుంచి చింతా ప్రభాకర్ ప్రజలకు అభివాదం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తదనంతరం గంజి మైదాన్ వద్ద ఆయన మాట్లాడుతూ.. మీరు చూపిస్తున్న ప్రేమ, అభిమానానికి ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకో లేనిదని ప్రజలను ఉద్దేశించి అన్నారు. 'నాకు ఇది చివరి అవకాశం.. నా చివరి కట్టే కలేంతవరకు మీ మధ్యలోనే ఉంటాను' అని కంటతడి పెట్టారు. దాంతో గులాబీ శ్రేణులు ఒక్కసారిగా.. జై సీపీ అంటూ నినాదాలతో గం జి మైదానాన్ని హోరెత్తించారు. కాగా వారికిచ్చిన హామీలను అమలు చేయడంలో శాయశక్తులా కృషి చేస్తానని చింతా ప్రభాకర్ తెలిపారు. 'మీరే నా బలం.. మీరే నా బలగం.. ఆరోగ్యం.. నా ధైర్యం' అని అన్నారు. ఈసారి ఆదరించి.. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిం చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ ఉపాధ్యక్షులు పట్నం మాణిక్యం, మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి, ఆత్మకూరు నాగేష్, డీసీసీబీ చైర్మెన్ బుచ్చిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నరహరిరెడ్డి, హకీం, మాజీ డీసీసీ బీ చైర్మెన్ విజయేందర్ రెడ్డి, నక్క నాగరాజ్‌గౌడ్, వెంక టేశ్వర్లు,నర్సింలు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- సిద్దిపేట జిల్లాలో 9, 48, 664 ఓటర్లు
- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్

నవతెలంగాణ-సిద్దిపేట, సిద్దిపేట కలెక్టరేట్

శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని హుస్నాబాద్, సిద్దిపే ట, దుబ్బాక, గజ్వేల్ శాసనసభ నియోజకవల పరిధిలో గల మొత్తం 1151(హుస్నాబాద్ 304, సిద్దిపేట 273 దుబ్బాక 253 గజ్వేల్ 321) పోలింగ్ కేంద్రాల పరిధిలో 9 లక్షల 48 వేల 664 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ 30న తమ ఓటు హక్కును ఉపయో గించుకో వాలని కోరారు. ఎన్నికల సంఘం మార్గద ర్శకాల ప్రకారం పోలింగ్ 30న ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసా గుతుందన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 1151 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1151 మంది అసిస్టెం ట్ ప్రిసైడింగ్ అధికారులు, 2302 మంది అధర్ ప్రిసై నింగ్ అధికారులు విధులు నిర్వహిస్తారని, వారికి అదనంగా 817 మంది రిజర్వు సిబ్బంది అందు బాటు లో ఉంటారన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతా వరణం లో నిర్వహించేందుకు 1400 మంది జిల్లా పోలీస్ సిబ్బంది, 10 కంపెనీలకు చెందిన సుమారు 1000 మంది పారా మిలటరీ సిబ్బంది విధులు నిర్వ హిస్తాం న్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళ వారం సాయంత్రం 5 గంటల నుండి డిసెం బర్ 1 ఉదయం 5 గంటల వరకు 144 సెక్షన్ అమ ల్లో ఉం టుందన్నారు. ఐదుగురు లేదా అంతకన్నా ఎక్కు వమ ంది జమకూడొద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సి



విజిల్ యాప్ ద్వారా కానీ, 1950 టోల్ ఫ్రీ నెంబ ర్‌కు కానీ తగు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకా రం చర్యలు తీసుకుంటామన్నారు. నేటి సాయంత్రం 5 గంటల నుండి 30న పోలింగ్ పూర్తయ్య వరకు జిల్లా లో గల మద్యం దుకాణాలనన్నింటిని క్లోజ్ చేశా మని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో అక్రమంగా తరలి స్తున్న 2 కోట్ల 50 లక్షల రూపాయల నగదు, 3.7 కోట్ల రూపాయల విలువైన 2.8 లక్షల లీటర్ల లిక్కర్, 13 కిలోల వెండి, 300 కేజీల గంజాయిని సీజ్ చేశామ న్నారు. ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకొని ఎన్నికల పోలింగ్ నిర్వహించే విద్యా సంస్థలు, ఇతర కార్యాల యాలకు ఎన్నికల రోజు, ఎన్నికలకు ఒక రోజు ముందు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యా లయ ాలు, కర్మాగారాలు, ఫ్యాక్టరీలు అన్నింటికీ వేతనంతో కూడిన సెలవులను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఎంసిసి ద్వారా ఎన్ని కల నిబం ధనలను ఉల్లంఘించినందుకు వివిధ రాజ కీయ పార్టీ లపై 29 ఎఫ్ఐఆర్ లను బుక్ చేశామన్నారు. ఎలాంటి ప్రలోభాలకు ఆశపడి ఓటును దుర్వినియోగం చేసుకోరాదని, ప్రశాంతంగా ఓటును వేసేందుకు అన్ని ఏర్పాట్లను చేశామని, ప్రజలు నిర్భ యంగా వారికి నచ్చిన వారికి ఓటు వేయాలన్నారు.

మనీ మద్యం ప్రభావం లేకుండా చూడాలి

నవతెలంగాణ -సిద్దిపేటకలెక్టరేట్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మనీ, మద్యం ప్రభావం లేకుండా చూడాలని, ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అధ్యక్షతన ఎన్నికల నిఘా బృందాలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఆదేశించారు. మ్యారేజ్ హాల్స్, ఫంక్షన్ హాల్స్, లాడ్జిలు, కమ్యూనిటీ హాల్స్‌పై తనిఖీలు నిర్వహించాలన్నారు. మద్యం అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అన్ని ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల రవాణా, పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూములకు తరలింపుపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు జయశ్రీ, మన్మోహన్ ప్రసాద్, బుటియా, ఎ.వెంకటేష్ బాబు, వివేక్ కుమార్ సిన్హా, సీపీ శ్వేత, జిల్లా అదనపు కలెక్టర్ (దుబ్బాక ఆర్వో) గరిమా అగ్రవాల్, అడిషనల్ డిసిపి అడ్మిన్ అందె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరుగా ఎదుర్కోలేక దాడులు..

- కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలను నమ్మొద్దు
- దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-దుబ్బాక/ దుబ్బాకరూరల్

2023 ఎన్నికల్లో తనను నేరుగా ఎదుర్కోలేక ప్రతి పక్షనాయకులు దాడి చేశారని మెదక్ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. దుబ్బాక పట్టణ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిషన్ భగీరథ ద్వారా నేడు వంటింటికే నీళ్ళు అందేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగునీటిని అందించి రైతుల కళ్ళల్లో ఆనందం నింపారన్నారు. అదేవిధంగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నారన్నారు. గత ఉప ఎన్నికల్లో అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేసి రఘునందన్ రావు గెలిచారన్నారు. ఈ నియోజకవర్గంలో ఫ్యాక్టరీలు తెస్తానని, యువతకు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. ఈసారి ఆయన్ను ప్రజలే నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఇక తనపై జరిగిన కత్తి పోటు దాడిని ప్రతిపక్షాలు చేయించాయని ఆరోపించారు. కర్ణాటకలో ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక ప్రజలను మోసం చేసి.. ఇక్కడ ఆ పథకాలను అమలు చేస్తామని



కాంగ్రెస్ చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. దుబ్బాక ప్రజలు కాంగ్రెస్, బీజేపీలను నమ్మే ప రిస్థితి లేదన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో దుబ్బాకను మరింత అభివృద్ధి చేస్తానని, ఒక్క సారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించి, అవకాశం ఇవ్వాలని కోరారు. దుబ్బాక ప్రజల చిరకాల వాంఛలైన రెవిన్యూ డివిజన్, మున్సిపాలిటీ ఖ బాహ్యావలయ రహదారి, మిరుదొడ్డి, చేగుంట, దౌల్తాబాద్‌లో డిగ్రీ కళాశ ాలల ఏర్పాటుతో పాటు కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయం, రేకుల కుంట మల్లన్న ఆలయాల అభివృద్ధి బాధ ్యత తనదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీ సతీమణి కొత్త మంజులత, కొత్త పృథ్వీ కృష్ణారెడ్డి, మున్సిపాల్ చైర్మన్ గన్నె వనిత, బీఆర్ఎస్ నాయకులు కత్తి కార్తీక గౌడ్, సోలిపేట సతీష్ రెడ్డి, రొట్టె రాజమౌళి తదితరులు ఉన్నారు.

మద్యం సీసాల పట్టివేత

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలక్షన్ నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న మద్యాన్ని స్థానిక పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. 16 కేసుల్లో 394 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్టు ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని తరలించొద్దని.. నిబంధ నలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవ తెలంగాణ-గజ్వేల్



బియ్యం గింజలను ఉప యోగించి ఈవియం మిష న్ చిత్రాన్ని చిత్రించారు పట్టణా నికి చెందిన శ్రీరామ కోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షు లు, రాష్ట్రస్థాయి కళారత్న అవా ర్డు గ్రహీత రామకోటి రామరా జు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వజ్రాయు ధంలాంటి ఓటును ప్రతి ఒక్కరు వినియోగిం చుకోవాల ని ఆయన కోరారు. నోటుకు ఓటు అమ్ముడు పోవొద్దన్నారు. రాజకీయ నాయకుల తలరాతను మార్చే హక్కు ఓటుకు మాత్రమే ఉందన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తా



నవతెలంగాణ-నర్సాపూర్

తనను ప్రజలు ఆశీర్వదించి నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని భారత చైతన్య యువజన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరిగారి ఆగమయ్య అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత చైతన్య యువజన పార్టీ రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని గుర్తు చేశారు. భారత చైతన్య యువజన పార్టీ అధికారంలోకి వస్తే నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా నర్సాపూర్ నియోజకవర్గాన్ని పరిపాలిస్తున్న ఎమ్మెల్యేలు నర్సాపూర్ నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని ఆయన గుర్తు చేశారు. తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే నిరంతరం అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, శ్రీనివాస్, మధు చారి, శ్రీనివాస్ కార్యకర్తలు ఉన్నారు.

త్వరలో భూ నిర్వాసితుల ఆవేదన 'వలస' లఘుచిత్రం

నవతెలంగాణ-తొగుట



త్వరలో భూ నిర్వాసి తుల ఆవేదన తెలిపేదే 'వలస' లఘు చిత్రం విడుదల కానుందని నటుడు అలువాల కిష్టాగౌడ్ అన్నారు. మంగళవారం విలేకరు లతో మాట్లా డుతూ హెచ్.అచ్యుత్‌రెడ్డి నిర్మాత, దర్శకత్వంలో యూ ట్యూబ్ ద్వారా "వలస" లఘు చిత్రం విడుదల అవుతుం దన్నారు. 'ఈ చిత్రంలో కాకతీయులు, నిజాం నవాబులు, బ్రిటిష్ ప్రభుత్వాల నుంచి నేటి ప్రభుత్వాలు ప్రాజెక్టులు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. గతంలో గొలుసుకట్టు చెరువులు నిర్మించారు. ప్రాజెక్టులు నిర్మించినప్పుడల్లా ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు కష్టాలు వర్ణనాతీతం. ప్రజలు గ్రామాలు విడిచి వెళ్లే క్రమంలో కొందరు గుండె పగిలి ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కోకొల్లలు. భూ నిర్వాసితుల బాధలని దృష్టిలో పెట్టుకొని తీసిన లఘు చిత్రమే వలస' అని తెలిపారు. చిత్రం దర్శక,నిర్మాత హనుమండ్ల కాడి అచ్యుత్‌రెడ్డి అన్నారు.

భారీగా తరలివెల్లిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



గజ్వేల్‌లో నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభకు మనోహరాబాద్ మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు ప్రజలు తరలివెల్లారు. మండలంలోని కోనాయిపల్లి, చెట్లగౌరారం, రంగాయిపల్లి గ్రామాల నుంచి ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి, మండల రైతు బందు అధ్యక్షులు యంజాల సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలివెల్లారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ చేపడుతున్న ప్రజా రైతు సంక్షేమ పథకాలే భారీ మెజారిటీతో గెలిపిస్తాయని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ గెలిచి ముఖ్యమంత్రి కావడం ఇక్కడి ప్రజల అదృష్టమని ప్రతి ఒక్కరు బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. ఇతర పార్టీలకు కనీసం మండలం నుంచి కనీసం డిపాజిట్ కూడా లేని విధంగా ప్రజలు ఇతర పార్టీలకు బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యంజా ప్రభాకర్‌రెడ్డి, కోనాయిపల్లి పీటి ఉపసర్పంచ్ మన్నె ధర్మేందర్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత మిత్ర పథకం చారిత్రాత్మకం

- పద్మశాలి సంఘం రాష్ట్ర కన్వీనర్ బూర మల్లేశం



నవతెలంగాణ-వర్గల్

సమాజంలో పద్మశాలిలు ఎదగడానికి తపించే గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని తెలంగాణ పద్మశాలి సంఘం కన్వీనర్ బూర మల్లేశం పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ క్షేత్రంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం కేసీఆర్ గజ్వేల్ నుంచి విజయం సాధించడంతో పాటు హ్యాట్రిక్ సీఎంగా బాధ్యతలు స్వీకరించాలని ప్రార్థిస్తూ ముడుపు కట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేనేత భీమా, చేనేత పెన్షన్లు అందజేస్తున్న ఘనతను దక్కించుకున్నారన్నారు. రైతుబంధు తరహా లోనే చేనేత బీమాతో రూ.5 లక్షల బీమా వర్తింప చేస్తుండగా, చేనేత పెన్షన్ పథకంతో రూ 3 వేల ఆర్థిక సాయం అందుతున్నట్లు స్పష్టం చేశారు. చేనే తకు ఆదరణ తగ్గుతున్న సమయంలో సీఎం కేసీ ఆర్ పెద్ద ఎత్తున అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహి స్తున్నారన్నారు. చేనేతకు పరిశ్రమ హెూదా కల్పించి రాయితీ ఇవ్వాల్సిన కేంద్ర సర్కార్ అవేమీ పట్టించు కోవడం లేదని ఎద్దేవా చేశారు . అందుకు భిన్నంగా రాష్ట్రంలో మర మగ్గాలు కలిగిన చేనేత కార్మికులకు జియో ట్యాగింగ్ చేస్తూ చేనేత మిత్ర , భీమా పథకం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చేనేత కార్మికులు, పద్మశాలీలను అన్ని రకాలుగా ఆదుకుంటున్న కేసీఆర్‌కు అండగా నిలిచి ఆశీర్వదించాలన్నారు.

ధర్మ సమాజ్ పార్టీతోనే ధర్మ పాలన సాధ్యం



నవ తెలంగాణ- దుబ్బాక

ధర్మ సమాజ్ పార్టీతోనే ధర్మబద్ధమైన పాలన సాధ్యమని ఆ పార్టీ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వెంకట ప్రసన్న అన్నారు. నిజా యితీ, న్యాయమైన పరిపాలనను ధర్మసమాజ్ పార్టీ మాత్రమే అందిస్తుందన్నారు. మంగళ వారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టార్చ్ లైట్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. చందు, లక్ష్మణ్, దీపక్, బాలు, శ్రీకాంత్ ఉన్నారు.

సీఎంకు విల్లు బహూకరణ



నవ తెలంగాణ-గజ్వేల్ : గజ్వేల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు విచ్చేసిన సీఎం కేసీఆర్‌కు ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దేవీరవీందర్ విల్లు అందజేశారు.

మహనీయుల ఆశయాలు కొనసాగించాలి

- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య

నవ తెలంగాణ-మిరుదొడ్డి



మహనీయుల ఆశలను కొనసాగిం చాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు అక్బర్ పేట భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో మంగళ వారం మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహా లకు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన భారతీ య సామాజిక కార్యకర్త,కుల వ్యతిరేక సంఘ సంస్కర్త, రచయిత, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళలు అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో ఆయన చేసిన కృషి ఎంతో ఉందన్నారు. జ్యోతిరావు పూలే అతని భార్య "సావిత్రీబాయి పూలే "భారతదేశంలో స్త్రీల విద్యకు మార్గదర్శకులన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వడ్ల ప్రభాకర్, బోయ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రవిమాజీ ఎంపీటీసీ ఉల్లెంగల నవ్య నరేష్, సందిరి రాజిరెడ్డి, ఏరుమని దుబ్బ రాజం, వార్డ్ సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ పర్స స్వామి,గ్రామ కమిటీ అధ్యక్షులు అయితం శ్రీనివాస్, ముదిరాజ్ సంఘ సొసై టీ చైర్మన్లు ఉదిది రాజు, జగన్, ఇంచర్గ్ పాప ని సురేష్, కుమ్మరి రాజు, నాయి బ్రాహ్మణ కుల అధ్యక్షులు మంగలి వినోద్, బూత్ కన్వీ నర్లు, పూలే కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నోట్లు, మందు సీసాలను పంచుతున్న పార్టీలు

నవ తెలంగాణ-సిద్దిపేట



ప్రజలకు నోట్ల కట్టలను, మందు సీసాలను పంచుతూ ప్రలోభాలకు గురి చేస్తున్న పార్టీలపై ఎన్నికల సంఘం చట్టరీత్య చర్యలు తీసుకోవాలని సిద్దిపేట విద్యార్థి, నిరుద్యోగ, ప్రజా సంఘాల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఓటర్లకు బీఆర్ఎస్ పార్టీ నేతలు డబ్బులు, మందు సీసాలను పంచుతూ ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సంఘాల నాయకులు సత్తయ్య, భువేష్వర్‌లు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అనేక గ్రామాల్లో సామాన్య ఓటర్లకు సంబంధం లేకుండా వారి కుల సంఘాల పేర్లతో ఏకగ్రీవ తీర్మానాలు చేపిస్తున్న హరీశ్ రావుపై చర్యలు తీసుకోవాలన్నారు. తనకు ఓటు వేసి కేసీఆర్, హరీశ్ రావుల వెలమ దొర అహంకారాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు దుర్గ రాములు, నిరుద్యోగ జేఎసి నేతలు విజయ్, బిక్షపతి, యుగెందర్, న్యాయవాది రాజ్ కుమార్, ప్రశాంత్, రాణా ప్రతాప్, శ్రీకాంత్, పవన్, మహేష్, ప్రణయ్, విజయ్, రాజేష్, హిమవంత్, అగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలను చూడొద్దు...ఆలోచించి ఓటు వేయాలి

- మానవ హక్కుల వేదిక కమిటీ సభ్యులు సంపత్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



జెండాలు, పార్టీలను చూసి మోసపోకుండా అభ్యర్థి మనకు నిస్వార్థంగా సేవ చేస్తాడా లేదా అని ఆలోచించి ఓటు వేయాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యులు ముక్కెర సంపత్ కుమార్ కోరారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఓటు విలువను తెలియజేసే కరపత్రాలను మంగళవారం హుస్నాబాద్ మండలంలోని కిషన్ నగర్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ఓటు అనే వజ్రాయుధాన్ని ఇచ్చిందని, దానిని సద్వినియోగం చేసుకుని సరైన నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. రాబోయే ఐదేళ్లు మనల్ని సుభిక్షంగా పరిపాలించి మన బాగోగులు చూసే నాయకునికే ఓటు వేయాలన్నారు. డబ్బులకు, మద్యానికి ప్రలోభ పడి అత్యంత విలువైన ఓటును దుర్వినియోగం చేయరాదని తెలిపారు. ఏదో ఒక రాయిలే అని అనాలోచితంగా ఓటు వేస్తే 5 ఏళ్లు మరిన్ని కష్టాలు అనుభవించాల్సి వస్తుందన్నారు.

వరి, మొక్కజొన్న విత్తనాల పంపిణి

నవతెలంగాణ-చేగుంట

మండలంలోని రాంపూర్, ఇబ్రహీంపూర్ గ్రామాలలో సెహగల్ ఫౌండేషన్ వారు గ్రామలలోని 50 మంది మహిళా రైతులకు జె.జి .యల్ 24423 వరి వంగడం విత్తనాలను పంపిణి చేశారు. సైకిల్ ఫౌండేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్ బాబు ఈ విత్తనాలను ఎలా సాగు చేయాలో పంట కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే వరి పంటను డ్రమ్ సీడర్ పద్దతిలో విత్తుకోవలని, విత్తడం వలన కూలీల ఖర్చు, పంట వ్యవధి తగ్గుతుందని అలాగే దిగుబడి పెరుగుతుందన్నారు. చీడపీడల బెడద కూడా తక్కువగా ఉంటుందని వివరించారు. సెహగల్ ఫౌండేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్ బాబు, ఎల్.ఆర్.పి సునీత, మౌనిక, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



అటు కోవర్టుల కలవరం ఇటు క్రాస్ ఓటింగ్ భయం

- ఓటమి అంచున హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి
- నమ్మకున్న గౌడవర్గం కూడా హ్యాండ్ ఇవ్వడమేంటి..?

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

పోలింగ్ సమయం దగ్గర పడుతున్న వేళ్ళ హుస్నాబాద్ కాంగ్రెస్ ను ఓటమి భయం వెంటాడుతున్నట్లు స్వయంగా ఆ పార్టీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. మరోవైపు పార్టీలో నెల రోజుల నుండి చురుగ్గా పనిచేస్తున్న కొవర్టులు తమ చర్యలను రహస్యంగా మరింత ముమ్మరం చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుల బలంతో గెలిచి తీరుతానని, గౌడ సామాజిక వర్గం తనకు చివరి నిమిషం వరకు అండగా ఉంటుందని పొన్నం ప్రభాకర్ భావించినట్లుగా ప్రస్తుత పరిస్థితి కనుచూపుమేరలో కనిపించడం లేదు. గత పది సంవత్సరాలుగా మా గురించి కానీ... మా పిల్లల గురించి కానీ... మా సాధక బాధల గురించి కానీ ఏ ఒక్క రోజు కూడా పట్టించుకోని ప్రభాకర్ పిలువని పేరంటంలా ఎన్నికలవేళ హుస్నాబాద్ నియోజకవర్గానికి వచ్చి గెలిపించమని బతిమాలిడితే మేమేమైనా చిన్నపిల్లల మా.... ఆయనను గెలిపించడానికి అంటూ స్వయంగా గౌడ కులస్తులు బహిరంగంగా ధిక్కారస్వరం వినిపిస్తుండడం సంచలనం.



మరోవైపు హుస్నాబాద్ కాంగ్రెస్ లో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగే సూచనలు కనిపిస్తుండడంతో ఏమి చేయాలో తెలియక కాంగ్రెస్ అభ్యర్థి తల పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. కరీంనగర్ కాంగ్రెస్ లో ఒకనాడు పెత్తనం చెలాయించిన రోజులలో మాజీ మంత్రి శ్రీధర్ బాబును, హుజురాబాద్ లో పాడి కౌశిక్ రెడ్డిని, హుస్నాబాద్ లో అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డిని పార్టీ పరంగా ముప్పు తిప్పలు పెట్టి... వారిని రాజకీయంగా ఎదగకుండా అడుగడుగునా అడ్డుకొని ఆటంకాలు సృష్టించిన పొన్నం ప్రభాకర్ ను హుస్నాబాద్ లో ఓడించడానికి ఈ ముగ్గురు నేతలు ప్రస్తుతం తెరవెనక నెల రోజుల నుండి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. తనకే ఎలాగూ టికెట్ వస్తుందని భావించి మూడు నెలలుగా ఉధృత ప్రచారం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డికి వెన్నంటి ఉంటూనే చివరి నిమిషంలో ఆయనను వెన్నుపోటు పొడిచిన పొన్నం ప్రభాకర్ ను ఈ ఎన్నికలలో దారుణంగా ఓడించటానికి ప్రవీణ్ రెడ్డి వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో పొన్నం బలపడితే తన రాజకీయ జీవితం అంధకారం అవుతుందన్న ఆందోళనలో ప్రవీణ్ రెడ్డి ఉన్నట్లు తెలిసింది. అలాగే హుస్నాబాద్ లో తాను పట్టు సాధించాలంటే ముందుగా ప్రవీణ్ రెడ్డి రాజకీయ జీవితాన్ని సమాధి చేస్తేనే అది సాధ్యమవుతుందని, అందువల్ల ముందు ఎమ్మెల్యేగా గెలిచి ఆ తర్వాత ప్రవీణ్ రెడ్డిని చక్రబంధంలో ఇరికించాలనే వ్యూహంలో పొన్నం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. పొన్నం ఈ ఎన్నికలలో గెలిస్తే రాబోయే రోజులలో స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో ప్రవీణ్ రెడ్డి వర్గానికి కాంగ్రెస్ పార్టీ నుండి బీఫార్మ్ దక్కకుండా ఆయన కేడర్ ను తెర మరుగు చేయడానికి పొన్నం ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు గుసగుసలు వినపడుతున్నాయి. ఇదిలా ఉండగా ఎప్పుడైతే పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ కాంగ్రెస్ టికెట్ తెచ్చుకున్నాడో ఆ మరుసటి రోజు నుండే ప్రవీణ్ రెడ్డి వర్గ క్యాడర్ పై మానసిక వేధింపులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. హుస్నాబాద్ కాంగ్రెస్ శ్రేణులపై ఎక్కువగా ఆధారపడకుండా కరీంనగర్ నుండి తన నమ్మిన బంటులను హుస్నాబాద్ రప్పించి వారి ద్వారానే ఆయన ఎన్నికల ప్రచారం సాధిస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. ఇక్కడి క్యాడర్ ను నమ్ముకుని వారికి బాధ్యతలు అప్పగించిన, వారిపై ఆధారపడి ప్రచారం కొనసాగించిన ప్రతి విషయాన్ని ప్రవీణ్ రెడ్డికి చేరవేస్తారని భయం పొన్నం లో నెలకొనడం వల్లనే ఆయన కరీంనగర్ క్యాడర్ ను హుస్నాబాద్ గడ్డపై డంప్ చేయించినట్లు తెలిసింది. చివరకు గ్రామాలలో ప్రచారం కోసం డీసీఎం వ్యాన్లు, ట్రాక్టర్ల ద్వారా దినసరి కూలీలను కూడా కరీంనగర్ నుండి ఇక్కడికి ప్రతిరోజు తరలించి ఎన్నికల ప్రచారాన్ని పొన్నం కొనసాగిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. ఇలాంటి పోకడల వల్ల హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్నటువంటి బలమైన కేడర్ గత్యంతరం లేక ఎన్నికలవేళ టిఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. పరోక్షంగా తెరచాటుగా మెజారిటీ కాంగ్రెస్ కేడర్ కూడా టిఆర్ఎస్ అభ్యర్థి సతీష్ బాబు విజయం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు సమాచారం.

ఐదు సంవత్సరాల పాటు ఎంపీగా కొనసాగిన సమయంలో హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం పొన్న ప్రభాకర్ కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయించకపోవడం.. చివరకు తన గౌడ సామాజిక వర్గం బాగోగుల గురించి కానీ ఏ ఒక్కరోజు చొరవ తీసుకోకపోవడం వంటి అహంభావ పరిస్థితుల వల్లనే ప్రస్తుతం ఎన్నికలవేళ హుస్నాబాద్ లో ఆయన గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటూ ఓటమిపాలు అవుతానేమోనని కలవర పడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. కులవృత్తి.. హమాలి.. కార్మిక సంఘాలలో గట్టిపట్టు కలిగిన ఐలేని మల్లికార్జున రెడ్డి మొన్నటికి మొన్న వైఎస్ఆర్సిపి పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సతీష్ బాబు సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరడం సంచలనం సృష్టించగా.. పోన్నం శిబిరంలో కలవరం మొదలైనట్లు తెలిసింది. తాజాగా మొన్న హుస్నాబాద్ లో జరిగిన ప్రియాంక గాంధీ ఎన్నికల సభ పేలవంగా జరగడంతో దాదాపుగా హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేతులెత్తేసినట్లేనని ప్రచారం మొదలైంది.

బిజెపి అభ్యర్థి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి బీసీ ఓట్లను పొన్నం ప్రభాకర్ కు దక్కకుండా తీవ్ర కృషి చేస్తుండడం.. మరోవైపు అంతర్గతంగా ఈ ప్రాంత బిజెపి క్యాడర్ శ్రీరామ్ చక్రవర్తి పై ఉన్న కోపంతో తెరవెనుక టిఆర్ఎస్ కు మద్దతు తెలుపుతుండడం వంటి అనేక పరిణామాలు జరుగుతుండడం వల్ల పొన్నం గమ్యం చేరకుండా..ఎమ్మెల్యేగా విజయం సాధించకుండా అడ్డు తగులుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

కాంగ్రెస్ బిజెపి ఎన్ని జిమ్మిక్కులు చేసినా బీఆర్ఎస్ దే గెలుపు

బీఆర్ఎస్ మహిళా నాయకురాలు కత్తి కార్తిక గౌడ్



నవతెలంగాణ దుబ్బాక రూరల్

దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ బిజెపి పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసిన బీఆర్ఎస్దే గెలుపని, ఈసారి కొత్త ప్రభాకర్ రెడ్డిని దుబ్బాకలో భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమని బీఆర్ఎస్ మహిళా నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ అన్నారు. సోమవారం అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డి పేట గ్రామంలో మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా సర్పంచ్ పుట్లగారి శంకర్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పేరూడి దయాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చింతల కృష్ణ, సురేష్లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందుతున్నాయని,ఆ ఘనత సీఎం కేసీఆర్దేనన్నారు.కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, అధికారం కోసం ప్రతిపక్షాలు చేసే జిమ్మిక్కులను ప్రజలు తిప్పుకొడతారన్నారు. నవంబర్ 30 న కారు గుర్తుకు ఓటేసి మూడోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ,దుబ్బాకలో ప్రభాకరన్నను గెలిపించాలన్నారు.

దుబ్బాక అభివృద్ధి బిఆర్ఎస్ తోని సాధ్యం

నవ తెలంగాణ మిరుదొడ్డి



దుబ్బాక నియోజకవర్గం బిఆర్ఎస్ తోని సాధ్యమవుతుందని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భూంపల్లి మనోహర్ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు తుమ్మల బాలరాజు అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండలం కాస్లాబాద్ గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కొత్త ప్రభాకర్ రెడ్డికి ఓటు వేసి గ్రామాలను మరింత అభివృద్ధి చేయించుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. గత మూడు సంవత్సరాలు బిజెపి అభ్యర్థి రఘునందన్ గెలవడం మూలంగా నియోజవర్గం నష్టపోయిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సర్వతో దుబ్బాక ను మరింత అభివృద్ధి చెందడానికి కొత్త ప్రభాకర్ రెడ్డి కృషి ఉంటుంది అని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి దుబ్బాక అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు బిక్షపతి యాదగిరి భూపతి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే

మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్

నవతెలంగాణ-రాయపోల్



రానున్న ఎన్నికల్లో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే,దుబ్బాక నియోజకవర్గంలో గెలిచేది కొత్త ప్రభాకర్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్సీ పారుఖ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం మంతూర్, అనాజీపూర్ గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండలం బిఆర్ఎస్ పార్టీకే మెజారిటీ ఇస్తుందన్నారు. గతంలో కూడా రాయపోల్ మండలం బిఆర్ఎస్ పార్టీకే మెజార్టీ ఇచ్చిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై టిఆర్ఎస్ పార్టీకే మద్దతు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత ఎన్నికల్లో గెలిచిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు మూడు సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి ఏం లేదని, కొబ్బరికాయ, కత్తెర పట్టుకుని తిరగడం తప్ప ఆయన చేసింది ఏం లేదన్నారు. సీఎం కేసీఆర్ మళ్లీ గెలిస్తే పేదల భూములు లాక్కుంటాడని ఎమ్మెల్యే రఘునందన్ రావు ఈ ఎన్నికల్లో గెలవడానికి తప్పుడు ప్రచారం చేస్తూ, ఎన్నికల్లో మళ్ళీ గెలవాలని చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో కాలేశ్వరం, కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టులను నిర్మించి రైతులకు వ్యవసాయ రంగానికి సాగునీరు అందించడం కోసం కృషి చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 5 గంటల కరెంటు, బిజెపి అధికారంలోకి వస్తే 6 గంటల కరెంటు, బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 24 గంటల కరెంటు, ఇందులో ఏ ప్రభుత్వం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు.ముచ్చటగా మూడోసారి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే రేషన్ కార్డు లేని ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు ఇప్పిస్తామన్నారు. ఆసరా పెన్షన్లు రూ.3 వేల నుండి రూ.5 వేలకు పెంచడం జరుగుతుందన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మామిడి మోహన్ రెడ్డి, జెడ్పిటిసి యాదగిరి, రైతుబంధు సమితి మండలాధ్యక్షులు మున్నా, మండల ఇన్చార్జి కిషన్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్, తొగుట కోఆప్షన్ సభ్యులు కలిమొద్దిన్, నాయకులు మంజూరు తదితరులు పాల్గొన్నారు.

సమన్యాయం చేసే నాయకుడిని గెలిపించుకోవాలి

నవతెలంగాణ-తొగుట



అన్ని కులాలను కంటికి రెప్పలాగా కాపాడుకునే నాయకుడిని గెలిపించుకోవాలని కురుమ,యాద వ, ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు అన్నారు. మంగళవారం ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామంలోని కురుమ, యాదవ, ముది రాజ్ సంఘాలతో సర్పంచ్ దామరంచ ప్రతాప్ రెడ్డి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావే శంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథ కాలు పై చర్చించారు.అనంతరం సర్పంచ్ మాట్లా డుతూ కెసిఆర్ గజ్వేల్ నియోజవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని ప్రతి ఒక్క కుల సంఘానికి తగి న ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.కురుమ,యాద వ సంఘానికి గొర్ల పెంపకం పై ఎన్నో సబ్సిడీలు ఇచ్చి సంఘాలకు ఆదుకున్నాడన్నారు.కులం ఓట్ల తో విడగొడుతు కుల రాజకీయం చేసే నాయకు లను ఎప్పటికీ నమ్మరాదని అన్ని కులాలను కంటి కి రెప్పలాగా చూసుకునే నాయకుడిని గెలిపించు కోవాల సూచించారు.కెసిఆర్ నాయకత్వంలో ప్రతి ఒక్క కులానికి సంక్షేమ పథకాలందయని మచ్చ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి చెరువు,వాగులలో చేప పిల్లలను పెంచి జీవన ఉపాధిని కల్పించాని అన్నారు.మరొకసారి బీసీ కుటుంబీకులు కలిసి కెసిఆర్ గారిని భారీ మెజార్టీతో గెలిపించి మూడో సారి ముఖ్యమంత్రిగా చేసే బాధ్యత మనందరి పైన ఉందన్నారు.అనంతరం యాదవ,ముదిరాజ్ సంఘం సభ్యులు కలిసి సర్పంచ్ ఏకగ్రీవ తీర్మానం అందించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు మేలు



నవతెలంగాణ-మర్కుక్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు మేలు చేకూరుతుందని, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్ ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిజమైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, కొత్త పిన్షన్, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇయ్యలేదని ఇటువంటి బీఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వానికి మళ్లీ ఎందుకు ఓటు వేయాలి అని ప్రశ్నిచ్చారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ప్రజలను కోరారు. స్థానికుడైన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డికి ఓటువేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లేశం గౌడ్, నర్సింలు, యాదగిరి, బిక్షపతి, నర్సింలు, రాజు, పవన్ కళ్యాణ్, నర్సింలు, క్రాంతి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులున్నారు.